
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 26 నవంబరు 2025

ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో ఉన్న మండలాల సంఖ్య 38. రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు మేరకు కందుకూరు నియోజకవర్గాన్ని (5 మండలాలు) ప్రకాశం జిల్లాలోకి, వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలిపితే ఆ సంఖ్య 30కి చేరుకుంటుంది. అంతేగాక ఎప్పటినుంచో నెల్లూరులో కలవాలన్న గూడూరు నియోజకవర్గవాసుల కల కలగానే మిగిలిపోనుంది. జిల్లాల పునర్విభజనపై రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం చేసిన సిఫార్సులను ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు మంగళ వారం ఆమోదం తెలిపారు. ఆ ప్రకారం నెల్లూరులో కలుస్తుంది అనుకున్న గూడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లాలోనే కొనసాగనుంది. వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలతోనూ నెల్లూరుకు సత్సంబంధాలు తెగిపోనున్నాయి.





30
మిగిలిన మండలాలు

గూడూరు తిరుపతి జిల్లాలోనే!!

నెల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల పునర్విభజనపై రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం చేసిన సిఫార్సులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ఆమోదం తెలిపారు. ఆ సిఫార్సు ప్రకారం కందుకూరు నియోజకవర్గం ప్రకాశం జిల్లాలో విలీనం కానుంది. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రకాశం జిల్లాలో ఉన్న కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపారు. అయితే దీనిని ఆ నియోజకవర్గ ప్రజలు తొలినుంచి వ్యతిరేకిస్తూనే వచ్చారు. ఈ నియోజకవర్గ ప్రజలకు ఒంగోలుతో అనుబంధం ఎక్కువ. నెల్లూరుతో పోల్చితే ఒంగోలు వీరికి అన్నివిధాలా అనువైనది. ఆ క్రమంలోనే ఈ నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలపాలని ప్రజలు గట్టిగా కోరుకున్నారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, లోకేష్‌బాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కందుకూరును ప్రకాశం జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారం జిల్లాల పునర్విభజనలో భాగంగా కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపడానికి ముఖ్యమంత్రి ఆమోద ముద్ర వేశారు.

● గూడూరు తిరుపతిలోనే..

కందుకూరు తరహాలోనే గూడూరు నియోజకవర్గ ప్రజలు నెల్లూరు జిల్లాలో కొనసాగాలని కోరుకున్నారు. వీరికి తిరుపతి కన్నా నెల్లూరు అన్నివిధాలా అనువైనది. ఈ నియోజకవర్గ ప్రజలకు తరతరాలుగా నెల్లూరు జిల్లాతో అనుబంధం ఉంది. ఆ క్రమంలోనే ఆ నియోజకవర్గ ప్రజలు గూడూరును నెల్లూరులో కలపాలని గట్టిగా కోరుకున్నారు. ప్రజల అభీష్టం మేరకు అలాగే చేస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, లోకేష్ బాబు హామీ ఇచ్చారు. అయితే జిల్లాల పునర్విభజన నేపథ్యంలో జిల్లాల మధ్య జనాభా దామాషా ప్రకారం అది సాధ్యపడలేదని తెలిసింది. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపితే జనాభా పరంగా తిరుపతి జిల్లా చిన్నది అయిపోతుందనే ఉద్దేశంతో గూడూరును యథాతథంగా తిరుపతి జిల్లాలోనే ఉంచినట్లు సమాచారం. కందుకూరు ప్రకాశం జిల్లాలో కలిపినా, గూడూరును యథాతథంగా తిరుపతి జిల్లాలోనే ఉంచినా నెల్లూరు జిల్లాలో జనాభా 20 లక్షల వరకు (సర్వేపల్లి నియోజకవర్గంతో కలిపి) ఉంటారు కాబట్టి గూడూరును నెల్లూరులో కలిపే ప్రతిపాదనను విరమించుకున్నట్లు తెలిసింది. పైగా అభివృద్ధి వికేంద్రీకరణ దృష్ట్యా కూడా గూడూరును నెల్లూరులో కలిపితే దుగరాజపట్నం ఓడరేవు కూడా ఈ జిల్లా పరిధిలోకే వస్తుందని, రెండు పోర్టులు ఒకే జిల్లా పరిధిలో ఉంచడం అభివృద్ధి పరంగా అసమానతలకు దారి తీస్తుందనే ఉద్దేశంతో గూడూరును తిరుపతిలోనే ఉంచాలని నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఏది ఏమైనా నెల్లూరులో కలవాలనుకున్న గూడూరు ప్రజల ఆశలు నెరవేరలేదు.

● గూడూరులోకి అదనంగా..

వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. ఈ మూడింటిని కూడా గూడూరు రెవెన్యూ డివిజన్‌లో కలపాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఇవి గూడూరు రెవెన్యూ డివిజన్‌లో కలిస్తే వెంకటగిరి నియోజకవర్గం పూర్తిగా తిరుపతి జిల్లాలో కలిసిపోతుంది.



పర్యాటక అభివృద్ధిపై అధికారులతో చర్చిస్తున్న లంకా దినకర్

జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ దినకర్

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా, చారిత్రాత్మకంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి సాధించడం ద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు గణనీయంగా పెంచవచ్చని తెలిపారు.

● మైపాడు అభివృద్ధికి..

మైపాడు బీచ్ వద్ద ఇప్పుడున్న సదుపాయాల ఆధునీకరణకు రూ.77లక్షల ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేశారని దినకర్ చెప్పారు. పల్లిపాడు వద్ద పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం అభివృద్ధి పనులకు రూ.26.04 కోట్లతో డీపీఆర్ తయారు చేసినట్లు చెప్పారు. బకింగ్‌హామ్ కెనాల్ అభివృద్ధి పనులు కూడా చేపట్టినట్లు చెప్పారు. దీంతో సముద్రంతో - మిగతా 7వ పేజీలో..

జిల్లాలో ఓటర్ల వివరాలు		
నియోజకవర్గం	2002	2025
కందుకూరు	2,07,885	2,29,160
కావలి	2,03,559	2,40,945
ఆత్మకూరు	1,91,076	2,15,969
కోవూరు	2,21,274	2,67,782
నెల్లూరు సిటీ	1,65,019	2,39,623
నెల్లూరు రూరల్	75,950	2,82,099
సర్వేపల్లి	1,82,733	2,32,933
ఉదయగిరి	2,06,427	2,42,314
మొత్తం	15,53,923	19,50,825

ఒకరికి ఒక ఓటే!

- జిల్లాలో జాబితా నవీకరణ ప్రక్రియ
- 'సర్' పేరుతో వివరాలు సేకరణ
- బోగస్ ఓట్ల ఏరివేతే లక్ష్యంగా ప్రక్రియ
- శాశ్వతంగా వలస వెళ్లిన వారు జాబితా నుంచి ఔట్!
- కొత్తవారి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఒకరికి ఒక ఓటు మాత్రమే ఉండేలా ఓటరు జాబితా నవీకరణ ప్రక్రియ జిల్లాలో ప్రారంభమైంది. పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించాలన్న లక్ష్యంతో జిల్లా యంత్రాంగం శ్రమిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరుతో ఈ రివిజన్ కార్యక్రమం జిల్లాలో ప్రారంభించారు. ఇప్పటికే బీఎల్‌ఓలకు శిక్షణ పూర్తవగా, అన్నీ పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ లెవల్ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతోంది. బోగస్ ఓటర్లను గుర్తించేందుకు 2002 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న ఓటర్ల జాబితాను ప్రస్తుతమున్న జాబితాతో సరిపోలుస్తూ ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి ధ్రువీకరించిన వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వారీగా నాటి ఓటర్ల జాబితాను బీఎల్‌ఓ యాప్‌నకు పంపించారు. 2025 ఓటర్ల జాబితాలో ఈ డేటాను అనుసంధానం చేసే మ్యాపింగ్ ప్రక్రియ ప్రారంభించారు. 2002 నాటికి 18 సంవత్సరాలు నిండి ఓటర్లుగా ఉన్న వారి వివరాలను తీసుకున్నారు. 2025 నాటికి వీరి వయసు 40 ఏళ్లకు పైబడుతుంది. ఇప్పటికి జాబితాలో 40 సంవత్సరాలు పైబడిన వారి వివరాలు, 2002లో 18 సంవత్సరాలు నిండి ఓటు పొందిన వారితో సరిపోల్చుతున్నారు.

● మ్యాపింగ్ ఇలా..

2002 ఓటరు జాబితాలో ఓటరుగా ఉన్న వారి ఫొటో ఉందా లేదా అనే అంశాన్ని పరిగణలోకి తీసుకుంటున్నారు. 2002 నాటికి 18 ఏళ్లు నిండినా ఓటరుగా నమోదు చేసుకోని వారి పేర్లు, ప్రస్తుత జాబితాలో - మిగతా 6వ పేజీలో..



కొండాపురంలో నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్లు, ట్యాంకర్లు

- శుద్ధిజలం సరఫరాపై కక్షకట్టిన వైసీపీ ప్రభుత్వం
- ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం నిర్వీర్యం
- రూ.50 కోట్ల ప్రజాధనం మట్టిపాలు
- ముళ్లపొదల్లో ట్యాంకర్లు, ట్రాక్టర్లు
- నిరుపయోగంగా మదర్ ప్లాంట్లు, ట్యాంకులు
- నాటి పాలకుల పాపం.. ప్రజలకు శాపం
- ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించాలని వేడుకోలు

గత వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీపైనే కాదు.. అమాయక ప్రజలపైనా కక్ష తీర్చుకుంది. ప్రజలకు శుద్ధిజలం అందించాలన్న ఉద్దేశంతో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని కక్ష కట్టి మరీ నిర్వీర్యం చేసింది. పథకం ముందు ఎన్టీఆర్ అనే పేరు ఉన్న కారణంగానో లేదా తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన ఏ పథకాలను అమలు చేయకూడదనే కక్షతోనో 2014-19 కాలం మధ్యలో ప్రారంభించిన పలు ప్రజాహిత పథకాలను నిర్దాక్షిణ్యంగా నిర్వీర్యం చేసింది. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ముళ్లపొదల పాలు చేసింది. అందుకు ఉదాహరణే ఎన్టీఆర్ సుజల పథకం.

నెల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మెట్ట ప్రాంతాల్లోని గ్రామాల్లో ప్రజలకు అతి తక్కువ ధరకు శుద్ధిజలం (మినరల్ వాటర్) అందించాలన్న ఉద్దేశంతో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ప్రవేశపెట్టారు. 5 రూపాయలకే 20 లీటర్ల శుద్ధ జలం ఇవ్వడం ఈ పథకం ఉద్దేశం. అయితే ప్రతిరోజు రూ.ఐదు చిల్లర కావాలంటే గ్రామీణుల వద్ద ఉండదు కాబట్టి ఏటీఎం కార్డు తరహాలో ఓ కార్డు ఇచ్చారు. అందులో నగదు జమ చేసుకోవచ్చు. ఇందుకోసం గ్రామాల్లో ప్రత్యేకంగా ట్యాంకులు కట్టారు. మదర్ ప్లాంట్ నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు ఈ ట్యాంకుల్లో నింపుతారు. ఈ ట్యాంక్ ముందుభాగంలో ఏటీఎం మిషన్ తరహాలో ఓ యంత్రం ఉంటుంది. అందులో మంచినీటి కోసం ఇచ్చిన ప్రత్యేక కార్డును ఇన్‌సర్ట్ చేస్తే కొళాయి నుంచి 20 లీటర్ల నీళ్లు వస్తాయి. కార్డులోని నగదులో నుంచి 5 రూపాయలు కట్ అవుతుంది. ఇలాంటి ఏర్పాట్లతో సిద్ధం చేసిన పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభానికి ముందే ఎలా పాడెక్కించింది.

● రూ. 50 కోట్లు మట్టిపాలు

2018లో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద జిల్లాకు రూ.50 కోట్లు మంజూరు చేసి, 49 కోట్లు విడుదల చేసింది. జిల్లావ్యాప్తంగా 14 మండలాల్లో ఈ పథకం కింద ఎంపికచేశారు. దుత్తలూరు, జలదంకి, కలిగిరి, కొండాపురం, సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు, ఆత్మకూరు, అనంతసాగరం, మర్రిపాడు, పొదలకూరు, దగదర్తి, బోగోలు మండలాలను ఎంపిక చేసి మదర్ ప్లాంట్లు, వాటర్ ట్యాంకులను నిర్మించారు. ఈ ప్లాంట్ల నుంచి వాటర్ ట్యాంకులకు నీటి సరఫరా కోసం ట్రాక్టర్లు, ట్యాంకర్లు కొనుగోలు చేశారు. పథకం దాదాపుగా ప్రారంభ దశకు చేరుకుంది.



సీతారామపురం : రంగనాయుడుపల్లి సమీపంలో నిరుపయోగంగా ఉన్న మదర్‌ప్లాంట్

అంతలో వైసీపీ అధికారంలోకి రావడంతో టీడీపీ అమలు చేసిన పథకాలపై కక్ష కట్టి ఈ శుద్ధి జలం పథకాన్ని తుంగలో తొక్కేసింది. నాటి ప్రభుత్వానికి భయపడిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అసలు ఈ పథకం వైపు కన్నెత్తి చూడలేకపోయారు. కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ట్యాంకర్లు మూలనపడిపోతున్నాయని, మదర్ ప్లాంట్లు, వాటర్ ట్యాంకులు నిర్వీర్యం అవుతున్నాయని, ఇందుకోసం ఖర్చు చేసిన రూ.50 కోట్ల ప్రజాధనం మట్టికొట్టుకుపోతోందనే విషయాన్ని వైసీపీ పాలకులకు వివరించలేకపోయారు.

● ఇప్పటికైనా మేలుకొంటారా!?

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి - మిగతా 6వ పేజీలో..

ఈ ముళ్ల పొదల్లోని ట్రాక్టర్లు, ట్యాంకర్లను చూశారా!? 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద వీటిని కొనుగోలు చేశారు. అరి తీరి వీటిని వినియోగించే సమయానికి ఎన్నికలొచ్చాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అంతే.. ఆరంభానికి ముందే ఈ పథకాన్ని తుంగలో తొక్కేశారు. కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ట్యాంకర్లను దొంగలకు వదిలేశారు. కొంతమంది ట్రాక్టర్ టైర్లు విప్పుకొనిపోయారు. ఇంకొంతమంది బ్యాటరీలు లాక్కెళ్లారు. ఇంకొందరు ట్రాక్టర్ సీట్లు పీక్కుపోయారు. లైట్లు, హైడ్రాలిక్‌లు ఇలా విలువైన పరికరాలన్నీ మాయమయ్యాయి. ఆరుబయట ఎండుకు ఎండుతూ.. వానకు తడుస్తూ తప్పు పడుతున్నాయి.



సోమశిలలో 73.467 టీఎంసీల నిల్వ

అనంతసాగరం నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి మంగళవారం 14,206 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టులో 74.467 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ ఉత్తర కాలువకు 500, డెల్టాకు 17,300, కండలేరుకు 750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బాగు చేయండి!

పాత నివేదికలతోనే సమావేశాలకు వస్తారా!?

జడ్పీ స్టాండింగ్ కమిటీలో సభ్యుల ఏకరువు

- వివరాలు 8లో..



ఆత్మకూరులో అర్ధంతరంగా ఆగిపోయిన కేవీకే భవనం

కేవీకేలకు మహర్దశ!

ఆత్మకూరు, కావలి కేంద్రాలకు నిధులు విడుదల 8

మిగిలిన కేవీకేలకు మోక్షమెప్పుడో..!?

క్రీడా వికాస కేంద్రాలకు మంచి రోజులు రానున్నాయి. రాష్ట్ర విభజన తరువాత 2018లో అధికారంలో ఉన్న నాటి ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో 50 శాతం పనులు కూడా పూర్తి చేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా వదిలేసింది. దీంతో అన్ని ప్రాంతాల్లో దాదాపు కేంద్రాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆత్మకూరు, కావలి కేవీకేలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఆత్మకూరు కేంద్రానికి రూ.1.78 కోట్లు, కావలికి రూ.2.78 కోట్లు విడుదల చేసి అసంపూర్తిగా ఉన్న పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో ఆత్మకూరు కేవీకేకు టెండర్లకు ఆహ్వానించగా మూడు నెలల్లోగా పనులు పూర్తి చేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కావలిలో మాత్రం త్వరలోనే టెండర్లకు ఆహ్వానిస్తామని అధికారులు తెలిపారు.



పోలీస్‌స్టేషన్ నుంచి వెనుతిరుగుతున్న పౌరసరఫరాల శాఖ అధికారులు

భోక్తల గుట్టు విప్పేనా!?

- తెరుచుకున్న ఎంఎల్ఎస్ గోదాము తలుపులు
- నిల్వలు పరిశీలించిన అధికారులు
- బియ్యం స్వాహాపై పోలీసులకు ఫిర్యాదు
- సమగ్రంగా ఇవ్వాలన్న పోలీసులు

- 8లో..

పశువుల్లో పచ్చికదమ్ము!

జాగ్రత్తలు తీసుకోకుంటే అంతే!

15వ తేదీ వరకు ఉచితంగా వ్యాక్సినేషన్

జిల్లాకు 1,89,600 టీకాల పంపిణీ

- వివరాలు 8లో..

రూ.1200 కోట్లు.. 4,554 విలేజ్ క్లినిక్‌లు

త్వరలో రాష్ట్రంలో నిర్మించబోతున్నాం

మనుబోలులో మంత్రి సత్యకుమార్

- వివరాలు 8లో..



నేడు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి రాక

కొడవలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపురం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ధ్వజ స్తంభ నిర్మాణానికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శంకుస్థాపన చేస్తారని టీడీపీ సీనియర్ నాయకుడు అజయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11,962
వెండి కిలో ధర	రూ. 1,60,800
వెండి ఒక గ్రాము	రూ. 165.80

పారుదల కాలువల్లో శరవేగంగా పూడికతీత

కోవూరు, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో మొదటి పంటకు రైతులు సమాయత్తమవుతున్న తరుణంలో.. పారుదల కాలువలన్నింటిలో శరవేగంగా పూడికతీత పనులు సాగుతున్నాయి. ఇందుకోసం కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సొంత ఖర్చుతో రెండు ఎక్సకవేటర్లను కేటాయించారు. స్థానిక నాయకులు దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. కోవూరు మండల పరిధిలోని గంగవరం, పాటూరు, పరిసర ప్రాంత పొలాలకు సాగు నీరందించే కాలువలన్నింటిలో క్రమపద్ధతిలో పూడిక తీస్తున్నారు. గతంలో కాలువల్లోని బుడగతామర, పిచ్చిమొక్కలను రైతులే చందాలు వేసుకుని తొలగించుకునేవారు. ఈ ఏడాది ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకుని నాలుగు సొంత ఎక్సకవేటర్లతో పనులు చేయిస్తున్నారు. అంతేకాదు వాటికయ్యే ఇంధనం ఖర్చు కూడా ఎమ్మెల్యేనే భరిస్తుండటంతో


కాలువలో పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్

రైతులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. తమ కాలువలను రైతులు దగ్గరుండి శుభ్రం చేసుకుంటున్నారు. దాదాపు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో చిన్నచిన్న కాలువల్లో పూడికతీత పనులను ఎక్సకవేటర్లతోనే పూర్తి చేశారు.

చాలా ప్రయోజనం:



రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కాలువ పూడిక తీత పనులకు ఎక్సకవేటర్లను కేటాయించారు. ఎక్కడ అవసరమైతే అక్కడికి పంపి పూడిక తీయిస్తున్నారు. పారుదల కాలువల్లో పూడికతీత వల్ల చాలా ప్రయోజనం చేకూరుతుంది

- సింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి, రైతు నాయకుడు

చిన్నకాలువల్లో పూడిక తీశారు



చిన్న కాలువల్లో పూడిక తీశారు. గతంలో సొంతఖర్చులతో పనులు చేసుకునేవాళ్లం. ఎమ్మెల్యే రైతులకు ఇబ్బందులు లేకుండా చేయడం ఆనందంగా ఉంది.

- దాసరి విజయకుమార్, రైతు సంఘం నాయకుడు



హక్కు పత్రాలతో చాలా ప్రయోజనాలు!

హేమంత్‌కుమార్, ఈవోపీఆర్‌డీ, ముత్తుకూరు

ముత్తుకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇళ్లకు, ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం అందజేస్తున్న హక్కు పత్రాలతో పలు ప్రయోజనాలు ఉన్నాయని మండల ఈఓపీఆర్డీ హేమంత్‌కుమార్ ఆంధ్రజ్యోతితో పేర్కొన్నారు. గ్రామ కంఠంలో ఇంటి స్థలాలు, ఇళ్లను పరిశీలించి, విచారణ అనంతరం హక్కు పత్రాలు అందజేస్తాం. ఈ హక్కు పత్రాలతో బ్యాంకు రుణం పొందవచ్చని, కొనుగోలు, అమ్మకాల సమయంలో ఉపయోగకరమన్నారు.

? హక్కు పత్రాల వల్ల ఉపయోగం ఏంటి

! ఇళ్ల స్థలాలకు, ఇంటికి ప్రభుత్వ హక్కు పత్రాల వల్ల స్థల వివాదాలకు తావుండదు. వారసులకు ఆస్తుల సంక్రమణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు రావు. అధికారకంగా పూర్తి హక్కు కలిగి ఉంటారు.

? హక్కు పత్రాల జారీ ఏ దశలో ఉంది

! తొలి దశలో 7 పంచాయతీల్లో హక్కు పత్రాలు జారీ చేశాం. రెండో ఫేజ్‌లో మరో 7 పంచాయతీల్లో జరుగుతోంది. మూడో దశలో మిగిలిన ఆరు పంచాయతీల్లో పూర్తి చేస్తాం. మార్చిలోగా లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

? ఇంటి పన్నుల వసూలు ఎలా

! ప్రస్తుతం ఇంటి పన్నుల చెల్లింపులు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయి. నేరుగా నగదు తీసుకునే పద్ధతి లేదు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా నేరుగా ఇంటి పన్నులు ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. దీనిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు ఇంటి పన్నులు సక్రమంగా చెల్లించి, పంచాయతీల అభివృద్ధికి సహకరించాలి.

పరిశుభ్ర హరిత గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం


శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో రంతులయ్య

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రమైన హరిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ రంతులయ్య, డిప్యూటీ ఎంపీడీఓ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీవో కార్యాలయంలో పరిశుభ్రమైన హరిత గ్రామం అనే అంశంపై పొదుపు మహిళలకు శిక్షణ ఇచ్చారు. పరిశుభ్ర మైన హరిత గ్రామాల నిర్వహణ కోసం సచివాలయాల సిబ్బందితో పాటు పొదుపు మహిళలకు శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

లింగ సమానత్వంపై అవగాహన ర్యాలీ

రాపూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలో గ్రామ సంఘ సభ్యులచే లింగ సమానత్వంపై ఏపీఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో ఈ నెల 25వ తేదీ నుండి డిసెంబరు 23 వరకు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అబ్బాయిలు, అమ్మాయిలను సమానంగా పెంచడం, బాల్య వివాహాలను అరికట్టడం, ఉన్నత విద్య, ఉద్యోగాలలో సమాన అవకాశాలు కల్పించడం మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సంఘసభ్యులు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

కండలేరు జలాశయం నీటి నిల్వ 57.08 టీఎంసీలు

రాపూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టిఎంసిలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 57.08 టిఎంసిలు ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుండి 1300 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో వస్తుండగా, 1030 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెళ్తుందని అధికారులు పేర్కొన్నారు.

హాస్టల్ భవనానికి భూమిపూజ


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మనుబోలులో రూ. 3 కోట్లతో నిర్మించనున్న ఎస్సీ బాలికల వసతి గృహం నూతన భవన నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరినా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దెబ్బతిన్న హాస్టల్‌నుంచి ఆడపిల్లలను మరో హాస్టల్ భవనంలోకి మార్పించామన్నారు. అనంతరం కేంద్రప్రభుత్వంతో మాట్లాడి కొత్త భవన నిర్మాణానికి రూ. 3 కోట్లు మంజూరు చేయించామన్నారు. వచ్చేఏడాది నుంచి బాలికల హాస్టల్ అందంగా తయారుకానుందన్నారు. హాస్టల్ విద్యార్థినులు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ రాంబాబు, ఈఈ పీ. కరీముల్లాఖాన్, డీఈ ఎంవీ సుబ్బారావు, ఏఈ వెంకటేశ్వర్లు, డీడీ శోభారాణి, ఏఎస్‌డబ్ల్యూవో సుధామణి, మ్యాట్రిన్‌లు మహేశ్వరి, అనిత, టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, మారంరెడ్డి రమణారెడ్డి, వెడిచెర్ల వెంకటరమణారెడ్డి, మధునాయుడు, మన్నెమాల సుధీర్‌రెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సొసైటీ పాలకవర్గాన్ని అభినందించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

ఇటీవల ఎంపికైన మనుబోలు సొసైటీ చైర్‌పర్సన్ పొన్నూరు రామకృష్ణయ్య, డైరెక్టర్ సాని వెంకటరమణయ్య, ఉడతా విజయకుమార్‌లను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సొసైటీ కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో మహేష్, ఏడీఏ శివనాయక్, ఏవో వెంకటకృష్ణయ్య, నాయకులు రఘురామనాయుడు, వెందోటి భాస్కర్‌రెడ్డి, తిక్కవరపు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగచాట్లపురం ఉర్దూ పాఠశాల తనిఖీ


బాలల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న అధికారి

పొదలకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగచాట్ల పురం ఉర్దూ ప్రాథమిక పాఠశాలను మంగళ వారం జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజామొహిద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతీ విద్యార్థి ఇష్టపడి చదవాలని, అప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థి స్థాయిని గుర్తించి వారు ఏఏ విషయాల్లో వెనుకబడి ఉన్నారో తెలుసుకుని తగిన విధంగా బోధించాలన్నారు. తల్లిదండ్రుల సమావేశాలు (పీటీఎంఎస్) తరచుగా నిర్వహించి, విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్యను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పాములవారిపాలెంలో 'రైతన్నా.. మీకోసం!'

ఇందుకూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాములవారిపాలెంలోని రైతన్న మీకోసం కార్యక్రమం ఇన్‌చార్జ్ ఏడీఏ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. నవంబరు 24 నుంచి 29వ తేదీ వరకు మండలంలోని అన్నీ రైతు సేవా కేంద్రాల పరిధిలో జరుగుతున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాబోయే 5 సంవత్సరాల్లో సాగునీటి యాజమాన్యం, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, మద్దతు ధర వంటి ఐదు విధానాలపై కార్యచరణ చేస్తుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ తిరుమల, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దామరమడుగులో పచ్చని పొలాల మధ్య ఏర్పాటు చేసిన 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రైతు బిడ్డలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు. రైతు కూలీల కొరత అధిగమించాలంటే ఆధునిక వ్యవసాయ పద్ధతులు అలవరచుకోవాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుచేసి రైతుల పొలాలు పరాధీనం కాకుండా కాపాడామన్నారు. చంద్రశేఖరపురం వద్ద ఏర్పాటు చేసిన ఇథనాల్ ఫ్యాక్టరీలు, బిర్లా సిమెంటు షీట్స్, సిమెంటు పైపుల కర్మాగారాలతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఆధునిక వ్యవసాయ విధానాలు, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పించారు. 20 ఏళ్ళుగా పూడిక తీతకు నోచుకోని కాలువల్లో పూడిక తీయించామన్నారు.


దామరమడుగులో వరి మడిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం

చంద్రబాబు సారథ్యంలో మీ సొంతింటి కలను సాకారం చేయడమే తమ లక్ష్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మంగళవారం బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని ఎస్ఎస్ కళ్యాణ మండపంలో నిర్వహించిన గృహాల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మొదటి విడతలో భాగంగా 285 మందికి గృహ నిర్మాణ పత్రాలు మంజూరు చేయడం సంతోషదాయకమన్నారు. ఇళ్ళ స్థలాలు లేనివారు పేర్లను త్వరగా నమోదు చేసుకోవాలని సూచించారు. ముందుగా ఇళ్ళు మంజూరైన లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, హౌసింగ్ డీఈ వెంకటరత్నం, ఏఈ చిన్న పెంచలయ్య తహసీల్దారు వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ ఏడీ అనిత, మండల వ్యవసాయాధికారి శ్రీహరి, బుచ్చి బ్యాంకు, వవ్వేరు బ్యాంకు అధ్యక్షులు శివరామకృష్ణారెడ్డి, దొడ్ల విజయలక్ష్మి, అర్బన్, గ్రామీణ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, బెజవాడ జగదీష్ టీడీపీ నేతలు కమలాకర్ రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, హరికృష్ణ, మండల రైతు విభాగం అధ్యక్షుడు పెనాక అమర్నాథరెడ్డి, కౌన్సిలర్లు లు పాల్గొన్నారు.

1వ తేదీకల్లా ఉద్యోగులకు జీతాలు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన ఎమ్మెల్యే ప్రశాంతి

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో జీతాలు రాక ఇబ్బందులుపడుతున్న సచివాలయాల ఉద్యోగులకు డిసెంబరు 1వ తేదీకల్లా ఈ నెల జీతాలు, 6వ తేదీపైన బకాయిలు చెల్లిస్తామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'వందమంది ఉద్యోగుల భవిత ప్రశ్నార్థకం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఈ మేరకు స్పందించారు. అధికారులతో చర్చించి, 49 మందికి వెంటనే జీతాలు ఇచ్చేలా చర్యలు చేపట్టారు.

ముగిసిన మండలకాల అన్నదాన కార్యక్రమం

రాపూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని మద్దెలమడుగు సమీపంలోని మహా విష్ణువు అయ్యప్ప స్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. అయ్యప్ప మాల ధరించిన స్వాముల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఈ అన్నదాన కార్యక్రమాన్ని మండలం రోజుల పాటు నిర్వహించారు. ప్రతి సంవత్సరం అయ్యప్ప స్వాములకు మధ్యాహ్నం ఒక పూట భోజనం ఏర్పాటు చేయడం ఆనవాయితీగా పెట్టుకున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. మొదటి, చివరి రోజు రాపూరు పట్టణ ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, సుహాసిని దంపతులు వ్యవహరించారు.

సీఎంతో ఎమ్మెల్యే కాకర్ల దంపతుల భేటీ

జలదంకి, (ఆంధ్రజ్యోతి):ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రవీణ దంపతులు మంగళవారం సీఎం చంద్రబాబు నాయుడుతో అమరావతిలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అమెరికాలో స్థిరపడ్డ రాష్ట్రానికి చెందిన డాక్టర్ హైమావతి మిక్కిలినేనిని ఎమ్మెల్యే కాకర్ల దంపతులు సీఎంకు పరిచయం చేశారు.

పుట్టలోంచి శివలింగం తెచ్చి పూజలు

పొదలకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తనకు శివుడు కలలో కనిపించి తనను తీసుకెళ్లమని చెప్పాడని ఓ బాలుడు అంటు న్నాడు. అంతేకాదు.. పుట్టలో నుంచి శివ లింగాన్ని తీసుకొచ్చి పూజలు కూడా చేస్తున్న ఉదంతం పొదలకూరు మండలం పులికల్లు గ్రామంలోని ఎస్టీ కాలనీలో చోటు చేసుకుంది. బాలుడితో పాటు గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గత మూడు నెల లుగా శివుడు తనకు కలలో కనిపించి, నేను ఫలానా చోట పుట్టలో ఉన్నాను.. నన్ను ఇక్క డ నుంచి తీసుకెళ్లి పూజలు జరపమని చెప్పా డని కాలనీకి చెందిన నాగేంద్ర అనే బాలుడు తెలిపాడు. అందరూ ఈ విషయాన్ని నమ్మ లేదు. గ్రామస్తులను ఎలాగో ఒప్పించి అటవీ ప్రాంతంలోని పుట్ట వద్దకు తీసుకెళ్లాడు. పుట్ట వద్ద నాగుపాము కనిపించడంతో వారు వెనక్కి వచ్చేశారు. తిరిగి మళ్లీ సోమవారం పుట్ట వద్దకు వెళ్లి, అక్కడ పుట్టను తవ్వి శివ లింగాన్ని కాలనీకి తీసుకొచ్చారు. తన ఇంటి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో ఇటుకలతో గుడి కట్టి, అందులో శివలింగాన్ని ఉంచి పూజ లు చేస్తున్నాడు. శివలింగాన్ని చూసిన ప్రజ లు ఆశ్చర్యపోతున్నారు.

ఏపీ ఎన్జీవో సంఘం కార్యవర్గం ఎంపిక

ఇందుకూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఇందుకూరుపేట తాలూకా ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణంలో మంగళవారం 11 పోస్టులకు గాను ఒక్కో పోస్టుకు ఒక్కొకరి చొప్పున 11 మంది మాత్రమే నామినేషన్లు వేయడంతో ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఎన్నికల అధికారిగా నెల్లూరు తాలూకా అధ్యక్షులు చిలక రామకృష్ణారెడ్డి, సహాయ ఎన్నికల అధికారిగా సురేష్, ఎన్నికల పరిశీలకుడుగా కృష్ణంరాజు వ్యవహరించారు. తాలూకా ఏపీ ఎన్జీవో అధ్యక్షుడిగా పి. రామిరెడ్డి, సహాధ్యక్షురాలిగా పి. శ్రావణి, ఉపాధ్యక్షులుగా ఎస్. రమ, ఎం. భాస్కర్‌రెడ్డి, టి. మల్లికార్జున రావు ఎంపికయ్యారు. కార్యదర్శిగా పి. మల్లికార్జున్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా కె. బ్రహ్మేశరనాయుడు, ఎస్‌డి ఉమర్‌అహ్మద్, డి.నారాయణమ్మ, మహిళా సంయుక్త కార్యదర్శిగా డి. వాణి, కోశాధికారిగా యు. సురేంద్ర, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం చేత ఎన్నికల అధికారులు ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలియజేశారు. ఇందుకూరుపేట తాలూకా నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ఇన్‌చార్జ్ అధ్యక్షులు నందిమండలం ఆంజనేయవర్మ, జిల్లా సెక్రటరీ గాదిరాజు రామకృష్ణ, జిల్లా జాయింట్ సెక్రటరీ రాజేంద్రప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు పులి సతీష్ బాబులకు అధ్యక్షులు పి. రామిరెడ్డి, కార్యవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం

రాపూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లమ్మగుంట గిరిజన కాలనీ మండల పరిషత్ పాఠశాలలో జాతీయ సేవ పథకం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి సాయి కిరణ్, ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి, సర్పంచ్ భూపతి జయమ్మ, ఎస్ఐ వెంకట రాజేష్, ఎంపీడీవో మారెళ్ల భవాని, ఏవో దశరథరామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు రక్షణ: సీఐ రవినాయక్

ముత్తుకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కృష్ణపట్నం సీఐ రవినాయక్, ఎస్ఐ జేపీ శ్రీనివాసులురెడ్డిలు సూచించారు. బ్రహ్మదేవం సమీపంలోని జెన్‌కో రహదారి కూడలిలో మంగళవారం వాహన చోదకులకు హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా వెళ్తున్న వారిని ఆపి, వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక శాతం మంది మృతులు తలకు తీవ్రగాయాల కారణంగా చనిపోతున్నారని తెలిపారు. ఇంటి నుంచి వెళ్లే వాహన చోదకులు తిరిగి క్షేమంగా ఇంటికి చేరేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. తగిన జాగ్రత్తలతో సురక్షిత ప్రయాణం శ్రేయస్కరమన్నారు. మితిమీరిన వేగం పనికిరాదన్నారు. జిల్లా ఎస్పీ, రూరల్ డీఎస్పీ ఆదేశాల మేరకు వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉదయగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వరాబాదు గ్రామ సమీపంలో 167-బీజీ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న మైదుకూరు శ్రీనివాసులు(39) మంగళవారం మృతి చెందాడు. ఈనెల 19న శ్రీనివాసులు ద్విచక్ర వాహనంపై వైఎస్‌ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం కృష్ణంపల్లి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో సర్వరాబాదు వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి బోల్తాపడడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతని మృతితో పట్టణంలోని మంగళగిరి కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పోలీసులను పరుగులు పెట్టించిన ఫోన్ కాల్

ఉదయగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసులను మంగళవారం ఓ వ్యక్తి చేసిన ఫోన్ కాల్ పరుగులు పెట్టించింది. వివరాల మేరకు.. భర్తను బంధువులతో కలిసి భార్య దారుణంగా కొట్టి చంపి కొత్తపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో ఉన్న పాడుబడిన బావిలో పడేశారని ఓ వ్యక్తి 100కు ఫోన్ చేశాడు. దీంతో పోలీసులు జిల్లాలోని పలు మండలాల్లో కొత్తపల్లి పేరుతో ఉన్న గ్రామాల్లో ముమ్మర విచారణ చేపట్టి అటవీ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఎక్కడా ఎలాంటి ఆచూకీ లభ్యం కాకపోవడంతోపాటు ఫోన్ కాల్ చేసిన వ్యక్తి ఎవరా అని ఆరా తీశారు. తీరా ఆ వ్యక్తి ఉదయగిరి మండలం బిజ్జంపల్లి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని వ్యక్తిగా నిర్ధారణ కావడంతో మిన్నకుండిపోయారు.

మద్యం బెల్టుషాపు వద్దంటూ నిరసన

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విరువూరు, కోటవర్ధనిపల్లి గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు వద్దంటూ మంగళవారం మహిళలు నిరసన చేపట్టారు. నిర్వాహకులు ఇష్టానుసారంగా అమ్మకాలు సాగిస్తుండడంతో కుటుంబాల్లో వివాదాలు తలెత్తుతున్నాయన్నారు. కూలినాలి చేసుకుని సంపాదించిన నగదును మద్యానికే ఖర్చు చేస్తున్నారని వాపోయారు. అమ్మకాలు నిలిపివేయాలని దుకాణదారులను ప్రశ్నిస్తే తమపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందని, ఇప్పటికైనా మద్యం బెల్టు దుకాణాన్ని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.

కోర్టు ఆవరణలో అత్తపై అల్లుడు, బంధువుల దాడి

కావలి రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కోర్టు ఆవరణలో అత్తపై అల్లుడు, అతని బంధువులు దాడి చేసిన ఘటన మంగళవారం కావలి పట్టణంలో జరిగింది. 1వ పట్టణ పోలీసులు, బాధితుల వివరాల మేరకు... పట్టణానికి చెందిన పూనూరు గీతాంజలికి దగదర్తి మండలం మనుబోలుపాడుకు చెందిన చేజర్ల మహేష్‌రెడ్డికి 2016లో వివాహం జరిగింది. అనంతరం వారి మధ్యన ఏర్పడిన మనస్పర్థలతో మహేష్‌రెడ్డిపై 2021లో వరకట్నం, వేధింపుల కేసు నమోదైంది. ఈ కేసు విషయమై గీతాంజలితో పాటు ఆమె తల్లి కామాక్షి కోర్టుకు రాగా కేసు జనవరి 28కి వాయిదా పడింది. దీంతో వారు కోర్టు నుంచి తిరిగి వెళ్తుండగా ఆ కేసులో నిందితులైన మహేష్‌తో పాటు ఆయన తండ్రి మహేంధర్‌రెడ్డి, వారి బంధువు రమేష్‌రెడ్డిలు కోర్టు ప్రాంగణంలోనే కామాక్షమ్మను చెప్పుతో కొట్టి దాడి చేసినట్లు బాధితురాలు వాపోయింది. దీంతో బాధితురాలు 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ ఫిరోజ్ ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాధితురాలు ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అయితే భార్యాభర్తల మధ్య జరుగుతున్న కోర్టు గొడవలకు ప్రధాన కారణం ఓ టీడీపీ నాయకుడేనని బాధితురాలు గీతాంజలి విలేకరుల ఎదుట వాపోయింది. నా భర్త లేని సమయంలో మా ఇంటికి వచ్చి నన్ను హింసించడంతో పాటు నాపై కేసులు పెట్టించి మా కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసి నాబిడ్డను ఇవ్వకుండా చేశాడని, పోలీసులను ఆశ్రయిస్తే నాబిడ్డను ఇచ్చారన్నారు. అప్పటి నుంచి మమ్మల్ని వేధిస్తున్నాడని, మాపై ఈ దాడికి అతనే ప్రధాన కారణమని గీతాంజలి వాపోయింది.జ

ఆత్మహత్యకు కారకుల అరెస్ట్

నెల్లూరు(క్రైం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : యువకుడు ఆత్మహత్య చేసుకునేందుకు కారకులైన నలుగురిని నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ స్టేషన్‌లో మంగళవారం నగర ఇన్‌చార్జి డీఎస్పీ ఎం గిరిధర్ కేసు వివరాలు వెల్లడించారు. వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన రోహిత్(17) అనే యువకుడిపై ఈ నెల 4వ తేదీన ప్రేమ వ్యవహారం నేపథ్యంలో అదే ప్రాంతానికి చెందిన కరిముల్లా, ఉమేరా, ఆసీఫ్, మహబూబ్ బాషా, మరో ఇద్దరు బాలలు దాడిచేశారు. దీంతో మనస్థాపానికి గురైన రోహిత్ ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. అతని తండ్రి వెంకయ్య ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి డీఎస్పీ గిరిధర్ కేసు దర్యాప్తు చేపట్టారు. యువకుడి ఆత్మహత్యకు కారకులైన నలుగురిని అరెస్ట్ చేశారు. ఇద్దరు బాలలను అదుపులోకి తీసుకుని జువైనల్ హోమ్‌కు తరలించారు.

భార్యతో గొడవపడి భర్త బలవన్మరణం

నెల్లూరు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవపడిన ఓ భర్త బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు రూరల్ ప్రాంతం కోడూరుపాడు గిరిజనకాలనీకి చెందిన పోట్లపూడి చెంచయ్య (21) ఈ నెల 23వ తేదీన తన భార్య ఆఫ్రీన్‌తో గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో పురుగుల మందు తాగాడు. అది గమనించిన భార్య స్థానికుల సహాయంతో చెంచయ్యను జీజీహెచ్‌కు తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మీరైనా స్పందించాలిక!

(5వ పేజీ తరువాయి)

వచ్చింది. ఇప్పుడైనా ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకంపై అధికారులు, పాలకులు దృష్టి సారిస్తారా!? అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. తక్కువ ధరకు శుద్ధిజలం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుకొంటున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను వివరణ కోరగా ఈ పథకం పునఃప్రారంభానికి సంబంధించి డీటైల్ ప్రాజెక్టు రిపోర్టు ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు. ఈ ప్రతిపాదన ఎప్పుడు ప్రభుత్వానికి అందుతుందో, కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

ఒకరికి ఒక ఓటే!

(5వ పేజీ తరువాయి)

నమోదై ఉంటే దీనికి కారణాలేమిటి? అప్పట్లో వీరి కుటుంబ సభ్యులు పేర్లు ఉన్నాయా అనే కోణంలో మ్యాపింగ్ చేస్తున్నారు. ఒకే పోలింగ్ కేంద్రం పరధిలో ఉన్నవారిని స్థానికులుగా గుర్తించటంతోపాటు మిగిలిన వారిని వలస ఓటర్లుగా భావించి ఇతర కేంద్రాలలో వారికి ఓటు హక్కు ఉందేమోనని ఆరా తీస్తున్నారు. పాత జాబితాలో పేరుండి, ప్రస్తుత జాబితాలో లేని వారి వివరాలు కూడా సేకరిస్తున్నారు. అంతేగాక 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరించటంతోపాటు మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగిస్తారు. కాగా, జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో 2002లో 15,53,923 మంది ఓటర్లు ఉండగా, 2025లో 19,50,825 మంది ఓటర్లు ఉన్నారు. 2002 కంటే 2025 నాటికి 3,96,902 ఓటర్లు పెరిగారు.

పారదర్శక జాబితా కోసమే

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించనున్నాం. ఓటర్ల జాబితా కచ్చితత్వం, సమగ్రత, స్వచ్ఛీకరణకు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన చర్యలలో భాగంగా జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతోంది.

- విజయకుమార్, జిల్లా రెవెన్యూ అధికారి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	117
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 660



రాజరాజేశ్వరి సేవలో శ్యామలా దేవి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని దివంగత సినీ నటుడు, కేంద్ర మాజీ మంత్రి కృష్ణంరాజు సతీమణి, సినీ హీరో ప్రభాస్ పెద్దమ్మ ఉప్పలపాటి శ్యామలాదేవి మంగళవారం దర్శించుకున్నారు. ఆమెకు అర్చకులు ఆలయ మర్యాదలు చేసి ఆశీస్సులు అందజేశారు. కాగా, ఆలయంలో మంగళవారం సాయంత్రం కాత్యాయనీ వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

పొరుగు వారి హక్కుల దేశవ్యాప్త ఉద్యమం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జమా అతే ఇస్లామీ హింద్ చేపట్టిన పొరుగువారి హక్కుల దేశవ్యాప్త ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగర డిప్యూటీ మేయర్ తహసీన్ పిలుపునిచ్చారు. మంగళవారం జమా అతే ఇస్లామీ హింద్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతీ ఒక్కరూ పొరుగువారి హక్కులకు గౌరవం ఇవ్వాలని, అప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని తెలిపారు. ఈనెల 21 నుంచి 30వతేదీ వరకు దేశవ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని నిర్వహిస్తున్న జమా అతే ఇస్లామీ హింద్ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షురాలు ఫాతిమా, నగర అధ్యక్షుడు మస్తాక్, సఫియా, అక్తర్, ఆయేషా, ఖాతూర్, శంషాద్‌బేం, వాహిదాబేగం, మల్లికా బేగం, హజీరా, అఫ్రోజ్, ముతహరీన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్ ఎత్తివేయాలి

● డీఈవోకు ఫాప్టో విజ్ఞప్తి

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సంఘం నాయకుడు హజరత్ సస్పెన్షన్ ఎత్తివేయాలని ఫాప్టో నాయకులు కోరారు. ఈ మేరకు నగరంలోని విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో బాలాజీరావుకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం 56 గంటలు దీక్ష చేసిన ఉపాధ్యాయుడిని కారణం లేకుండా సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ఉపాధ్యాయుల పక్షాన నిలబడి ఉద్యమాలు చేసేవారిపై కక్షకట్టడం మంచి పరిణామం కాదన్నారు. వెంటనే ఈ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫాప్టో రాష్ట్ర సభ్యుడు చిట్టేటి రమేష్, జిల్లా చైర్మన్ మధుసూదన్‌రావు, సెక్రటరీ జనరల్ జావీద్, కోచైర్మన్‌లు మురళీకృష్ణ, మాస ప్రసాద్, మాధవరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ నరసింహం, పిచ్చిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

స్వర్ణాల చెరువులో చేప పిల్లల విడుదల

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్వర్ణాల చెరువులో మంగళవారం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ గతేడాది ఈ చెరువులో 8లక్షల చేప పిల్లలను వదలగా, ఈ ఏడాది 13లక్షల చేప పిల్లలను వదిలేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. మొదటి విడతగా 5లక్షల చేప పిల్లలను వదిలామన్నారు. స్వర్ణాల చెరువులో చేప పిల్లలను వదలడం ద్వారా 400 కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనూష, మాజీ మేయర్ భానుశ్రీ, కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జి జలదంకి సుధాకర్, కోక్లస్టర్ ఇన్‌చార్జి విష్ణుప్రియ, ఈశ్వర్, బాబీ, రామకృష్ణ పాల్గొన్నారు.



చేప పిల్లలు వదులుతున్న గిరిధర్‌రెడ్డి

ప్రణాళికలు సిద్ధం చేయండి

(5వ పేజీ తరువాయి)

కనెక్టివిటీ కలిగి పర్యాటకులు ఆకర్షితులవుతారని తెలిపారు.

● మన చారిత్రాత్మక వారసత్వ సంపద వృద్ధిలో భాగంగా ఉదయగిరి హిల్ ఫోర్ట్, నరసింహ స్వామి దేవాలయ అభివృద్ధి కోసం రూ.36.50 కోట్లు, ఉదయగిరిలోని రంగనాయకుల దేవాలయం అభివృద్ధికి రూ.13.25 కోట్లు, శ్రీకృష్ణదేవాలయ అభివృద్ధికి రూ.2.45కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు చెప్పారు. బుచ్చిరెడ్డిపాలెం వద్ద కురుగుండ కనిగిరి రిజర్వాయర్ పర్యాటక కేంద్రం అభివృద్ధికి రూ.22.32 కోట్లు, పెంచలకోనలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధి కోసం రూ.20.62 కోట్లతో పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు చెప్పారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ద్వారా కేంద్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలో టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధి పనులు మొదలు పెట్టేందు కు ప్రయత్నిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి లక్ష్మీనరసింహారావు, జిల్లా అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ సభ్యుడు పెనుబల్లి కృష్ణచైతన్య, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఇందుకూరుపేట తహసీల్దారు మురళి, తదితరులు పాల్గొన్నారు.





ఉడ్ కాంప్లెక్స్...

రోడ్లంటేనే భయం

● వీధి వీధినా గుంతలే!
● అనేక ఏళ్లుగా ఇదే పరిస్థితి
● పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు
● ఇబ్బందులు పడుతున్న కార్మికులు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అయ్యప్పగుడి సమీపంలో ఉన్న ఉడ్ కాంప్లెక్స్ ప్రాంతంలో రోడ్లు అధ్వానం గా తయారయ్యాయి. దాదాపు 30 ఎళ్ల క్రితం ఏపీఐఐసీ (ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) ఆధ్వర్యంలో దాదాపు 50 ఎకరాల్లో 124 ప్లాట్లతో ఉడ్ కాంప్లెక్స్ పేరుతో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేశారు. ఎక్కువ శాతం కొయ్యల మిల్లులు, ఉడ్‌కు సంబంధించిన పరికరాల తయారీ దుకాణాలు, పరిశ్రమలు ఉండటంతో ఈ ప్రాంతానికి ఉడ్‌కాంప్లెక్స్ అనే పేరు పెట్టారు. పారిశ్రామిక వాడ ఏర్పాటు చేసిన మొదట్లో వేసిన తారురోడ్లు కొంత కాలానికే దెబ్బతిన్నాయి. పదేళ్లగా రోడ్లు మొత్తం గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా వర్షం కురిస్తే ఇక్కడి రోడ్లు చెరువులుగా, బురదమయంగా మారుతున్నాయి. అయినా ఏపీఐఐసీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంతంలో వందలాది మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. అయితే అధ్వానపు రోడ్లతో రాకపోకలు సాగించడానికి వారు అవస్థలు పడుతున్నారు. పలుమార్లు ఈ సమస్యపై ఏపీఐఐసీ అధికారులకు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేదని పారిశ్రామికవేత్తలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాము

ఉడ్ కాంప్లెక్స్‌లో మొత్తం రోడ్లు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము. అనేక సంవత్సరాలుగా ఇక్కడి రోడ్లు దెబ్బతినిపోయి ఉన్నాయి. ప్రభుత్వ అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాము.

- బ్రహ్మయ్య, ఐలా కమిషనర్





ఆధ్యాత్మిక నగరంగా నెల్లూరు

● వేణుగోపాల స్వామి ఆలయాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలి : మంత్రి ఆనం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరును ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని మూలాపేటలో వేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆ ఆలయ పునర్నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 58 ఆలయాల అభివృద్ధి పనులకు రూ.118.45కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. సంతపేటలోని వెంకటమ్మ పేరంటాలు ఆలయ రాజగోపురం, మహామండపం పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఆలయ పాలక మండలి సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఆలయ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఆనం

సాఫ్ట్‌వేర్ కంపెనీలతో 'నారాయణ' కళాశాల ఒప్పందం

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యో తి) : జిల్లాలోని నారాయణ ఇంజనీరింగ్ విద్యాసంస్థలు క్యూ ఎస్ ఎక్స్, ఫైస్క్వేర్ టెక్నాలజీస్ వంటి సాఫ్ట్‌వేర్ సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆ విద్యా సంస్థల మేనేజ్‌మెంట్ సెక్రటరీ వినయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్యూ ఎస్ ఎక్స్ సంస్థకు ప్రపంచ వ్యాప్తంగా అనేక శాఖలున్నాయని చెప్పారు. ఫైస్క్వేర్ టెక్నాలజీస్ సంస్థ గ్లోబల్ టెక్నాలజీ సంస్థగా గుర్తింపు పొందిందని తెలిపారు. తమ కళాశాలలతో ఈ సంస్థలు ఎంవోయూ కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. దీంతో ఎంతోమంది ఉద్యోగావకాశాలు పొందే అవకాశం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ దత్తాత్రేయశర్మ, ఫైస్క్వేర్ టెక్నాలజీస్ సీఈవో శ్రీనివాస్‌రాజు, క్యూఎస్‌ఎక్స్ ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ జైన్, కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ రవిప్రసాద్, డాక్టర్ విశ్వక్‌సేన్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ మురళి, డాక్టర్ నీరజ, సిబ్బంది పాల్గొన్నారు.



సాఫ్ట్‌వేర్ సంస్థలతో ఒప్పందం చేసుకుంటున్న ప్రతినిధులు

అక్రమ సస్పెన్షన్‌పై ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆందోళన

నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఏలూరు డిపోకి చెందిన పెట్రోల్ బంకులో జరిగిన అవకతవకలకు సంబంధించి సంబంధంలేని వారిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోల గ్యారేజ్ గేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నగరంలోని ఆర్టీసీ నెల్లూరు -1,2 డిపోల గ్యారేజ్ గేట్ల వద్ద జరిగిన నిరసన కార్యక్రమాల్లో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు సుందరయ్యను కక్షసాధింపు చర్యలతో విధుల నుంచి సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం నాగేంద్రరావు, రాష్ట్ర కార్యదర్శులు టీ దశరథ, సీహెచ్ రాజేశ్వరి, జోనల్ నాయకుడు ఎస్కే ఖాజావలి, జిల్లా నాయకులు షేక్ షబ్బీర్, డీ రమణయ్య, ఎన్ పంటయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

టీడీపీలో చేరికలు

నెల్లూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండ్లపూడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి సమక్షంలో వీరంతా పార్టీ కండువా కప్పుకున్నారు. గ్రామానికి చెందిన బట్ట తిమోతి, ఇసాక్, మోషే, సుబ్బారావు మిత్రబృందాన్ని పార్టీ లోకి ఆహ్వానించారు. అందరూ కలిసికట్టు గా పని చేసి ప్రభుత్వ పథకాలను పేద ప్రజల దరి చేర్చాలని ఎమ్మెల్యే పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో వేదగిరి క్షేత్రం మాజీ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

టైలర్స్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించండి

● సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి ప్రసాద్

నెల్లూరు (వైద్యం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని టైలర్స్ కాలనీలో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ కోరారు. స్థానిక సమస్యలపై రూపొందించిన కరపత్రాలను మంగళవారం ఆ కాలనీలో ఇంటింటికి పంపిణీ చేశారు. రోడ్లు, సైడు కాల్వల నిర్మాణాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరెడ్డి, ఖలీల్, జబ్బార్, గంగాధర్, రమణారెడ్డి, మున్వర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులను ఎదుర్కోవాలి

● ఐద్వా అవగాహన సదస్సు



మహిళా సదస్సులో మాట్లాడుతున్న అధ్యాపకురాలు భారతి

నెల్లూరు (వైద్యం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో ఎక్కువ మంది మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఐక్యరాజ్య సమితి నివేదికలో వెల్లడించిందని, ఈ వేధింపులను ధైర్యంగా ఎదుర్కొనేందుకు మహిళలు నడుం బిగించాలని విశ్రాంత అధ్యాపకురాలు భారతి, ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న దాడులపై నగరంలోని శెట్టిగుంట రోడ్డులో శనివారం అవగాహన సదస్సు జరిగింది. వారు మాట్లాడుతూ ప్రతి పది నిమిషాలకు ఒక మహిళ హత్యకు గురవుతోందని చెప్పారు. అలాగే, స్త్రీలు.. పిల్లలు డిజిటల్ హింసకు కూడా గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శివకుమారి, జిల్లా కమిటీ సభ్యురాలు షేక్ నాజున్నీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోక్సో చట్టం బాలికలకు వరం

● శక్తియాప్ అవగాహన సదస్సులో వక్తలు

నెల్లూరు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : పోక్సో చట్టం బాలికల పాలిట వరంలాంటిదని సౌత్ మోపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, నెల్లూరు రూరల్ ఏఎస్సై జే సుబ్బరాజు పేర్కొ న్నారు. ఆ కళాశాలలో మంగళవారం పోలీసులు శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టం పైన బాలికలతో పాటు బాలురు అవగాహన పెంచుకోవాలన్నారు. డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని సూచించారు. శక్తియాప్‌ను ప్రతీ మహిళ తన ఫోన్లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని, ఆపద సమయాల్లో అది ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సుప్రియ, రంగయ్య, శామ్యుల్ పాల్గొన్నారు.

పిల్లలను గిరిజన హాస్టళ్లలో చేర్పించండి

● చెత్త సేకరించే పేదలతో ఐటీడీఏ పీవో

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చెత్తను సేకరించే పేదలు వారి పిల్లలను గిరిజన సంక్షేమ హాస్టళ్లలో చేర్పించాలని ఐటీడీఏ పీవో మల్లికార్జున్‌రెడ్డి కోరారు. మంగళవారం నవజీవన్ ఆర్గనైజేషన్ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చెత్తను సేకరించే పేదలకు రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులను ప్రత్యేక శిబిరాల ద్వారా అందజేస్తామని చెప్పారు. అలాగే ఇంటి పట్టాలు, హెల్త్ కార్డులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చెత్త సేకరించే పేదలకు దుప్పట్లు, నిత్యావసర సరుకులను నవజీవన్ ఆర్గనైజేషన్ తరఫున అందజేశారు. తమ సంస్థ ద్వారా రెండు వేల మంది చెత్త సేకరించే పేదలకు సాయం అందజేస్తున్నామని నిర్వాహకుడు కే సహదేవయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ విక్టోరియా, ఈడీ లావణ్య, కార్పొరేషన్ హెల్త్ అధికారి కనకాద్రి, యానాది మహానాడు అధ్యక్షుడు రవి, నవజీవన్ సంస్థ కో ఆర్డినేటర్స్ పెంచలయ్య, విజయ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీపీఎస్‌పై అవగాహన కల్పించండి

● సిటీప్లానింగ్ ఆర్‌డీడీ మధుకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు(సిటీ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : మీ పరిధిలోని ప్రతీ భవన నిర్మాణదారుడిని కలిసి బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్) గురించి తెలియచేయాలని సిటీ ప్లానింగ్ ఆర్‌డీడీ మధుకుమార్ సూచించారు. మంగళవారం నెల్లూరుకు వచ్చిన ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించి అర్జులతో దరఖాస్తు చేయించాలన్నారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా, నగరంలోని రెడ్‌క్రాస్ వద్ద లేఅవుట్ స్థలాలను కమిషనర్ నందన్ పరిశీలించారు. ఎల్ఆర్ఎస్, బీపీఎస్ ద్వారా క్రమబద్ధీకరణ చేయించుకో వాలని వాటి యజమానులకు సూచిం చారు. అనంతరం కార్యాలయంలో రెవెన్యూ విభాగంతో సమీక్ష జరిపారు.

3ఫేస్‌తో వాణిజ్యరంగానికి లబ్ధి

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



త్రీ ఫేస్ కరెంట్‌ను ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, నాయకులు

నెల్లూరు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : రూరల్ నియోజక వర్గంలో చంద్రన్న విద్యుత్ వెలుగు పేరుతో అమల్లోకి తీసుకు వచ్చిన 24 గంటల త్రీ ఫేస్ కరెంట్ సరఫరా వల్ల చిన్న తరహా పరిశ్రమలు, వ్యాపారులకు లబ్ధి చేకూరుతుందని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పాతవెల్లంటిలో నూతనంగా ఏర్పాటు చేసిన త్రీ ఫేస్ కరెంట్ పనులను రైతులు, స్థానికులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. 24 గంటలు త్రీ ఫేస్ కరెంట్ ఇవ్వడం వల్ల వాణిజ్య రంగం అంతరా యం లేకుండా నడుస్తుందని చెప్పారు. త్రీఫేస్ సరఫరాకు విద్యుత్ శాఖ కష్టించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, జలదంకి సుధాకర్, చక్రవర్ధన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుజబుజ నెల్లూరులో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బుజబుజ నెల్లూరులో 33కేవీ, 11కేవీ సబ్‌స్టేషన్ వద్ద నూతన లైన్ల నిర్మాణం, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రాజాబాబు ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు దీన్ని గుర్తించాలని, అత్యవసర సర్వీసులు ఉన్నవారు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

రూ.1200 కోట్లు.. 4,554 విలేజ్ క్లినిక్‌లు

● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, పక్కన ఎమ్మెల్యే సోమిరెడ్డి తదితరులు

మనుబోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా రూ.1200కోట్లతో 4553 విలేజ్ క్లినిక్‌లు నిర్మించబోతున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మనుబోలులో రూ.1.65 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీని మంగళవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. గత ప్రభుత్వంలో ఇబ్బడిముబ్బడిగా పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌ల పేరుతో జీవోలు ఇచ్చి, నిధులు విడుదల చేయలేదని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను కూడా పక్కదారి మళ్లించారని ఆరోపించారు. పొదలకూరులో డయాలసిస్ సెంటర్, మనుబోలులో పీహెచ్‌సీ ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి పట్టుబట్టారన్నారు. అనంతరం పీహెచ్‌సీలో పనిచేసే వైద్యులు, సిబ్బందిని పరిచయం చేసుకుని, విధుల నిర హణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎం హెచ్‌వో సుజాత, ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, కేసీపీసీ చైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు, బీజేపీ, జనసేన మండలాధ్యక్షులు వాసిరెడ్డి రామిరెడ్డి, పెనుబాక ప్రసాద్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

● బలమైన పార్టీగా బీజేపీ

తోటపల్లిగూడూరు : రాష్ట్రంలో బలమైన పార్టీగా బీజేపీ ఏర్పాటు కానుందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. మండలంలోని విలుకానిపల్లి టీఎంఎస్‌ఆర్ కల్యాణ మండపంలో 6 జిల్లాల పరిధిలోని మండలాల బీజేపీ అధ్యక్షుల శిక్షణా తరగతులలో ఆయన ప్రసంగించారు. పార్టీ విస్తరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రమేష్ నాయుడు, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, భరత్, మాల్యాద్రి పాల్గొన్నారు.

నేడు సుబ్రహ్మణ్య షష్టి



నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో బుధవారం సుబ్రహ్మణ్య షష్టి పర్వదినానికి ఏర్పాట్లు చేశారు. దేవతల సైన్యాధిపతి అయిన సుబ్రహ్మణ్యేశ్వరుడిని కొలిస్తే సకల శుభాకాలు కలుగుతాయని, కుజ దోషం, నాగ దోషం వంటివి తొలగిపో తాయని, వివాహం, సంతానం వంటి కోరికలు నెరవేరుతాయని పండితులు చెబుతున్నారు. షష్టి పర్వదినం సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామికి పంచామృ తాభిషేకాలు, నాగ పడగలకు పాలాభిషేకాలు జరగనున్నాయి. జిల్లాలోని అన్ని శివాలయాలు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. నెల్లూరు నగరం ఉస్మాన్‌సాహెబ్‌పేట కాశీవిశ్వనాథ ఆల యంలో స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. అలాగే కనుపర్తి పాడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, సండేమార్కెట్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో విశేష పూజలు జరగనున్నాయి.

పశువుల్లో ప్రాణాంతక వ్యాధుల్లో పచ్చికదమ్ము ఒకటి. వ్యాధి లక్షణాలను గుర్తించి చికిత్స చేయిస్తే సరి లేదంటే ఒక్కరోజు వ్యవధిలోనే పశువులు చనిపోతాయి. ఇంతటి ప్రాణాంతక వ్యాధి నివార ణకు ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి టీకాల కార్యక్రమం జరుగుతోంది. ఇంటి వద్దకే పశువైద్యులు, సిబ్బంది వచ్చి అందిస్తారు. జిల్లాకు 1,89,600 టీకాలు సరఫరా కాగా, డిసెంబరు 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

పశువుల్లో పచ్చికదమ్ము!



టీకాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ చైతన్య కిషోర్ (ఫైల్)

● జాగ్రత్తలు తీసుకోకుంటే అంతే!

● 15వ తేదీ వరకు ఉచితంగా వ్యాక్సినేషన్

● జిల్లాకు 1,89,600 టీకాల పంపిణీ

పశువుల్లో (ఆవులు, గేదెలు) హెమరాజిక్ సెప్టిసేమియా ప్రాస్చురెల్లా అనే బ్యాక్టీరియా కారణంగా పచ్చికదమ్ము వ్యాపిస్తుంది. దీనిని గొంతువాపు, గురక వ్యాధి అని కూడా పిలుస్తుంటారు. తీవ్ర జ్వరంతో బాధ పడుతూ తీవ్రమైన గురక శబ్దం వ్యాధి ప్రధాన లక్షణం. ఇంకా గొంతు దగ్గర వాపు వచ్చి పశువులు ఆయాసపడుతుంటాయి. అంటే శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బం దులకు గురవుతుంటాయి. ముక్కు నుంచి చీమిడి కూడా కారుతూ ఉంటుంది. వ్యాధి ప్రభావంతో ఒక్కోసారి ఒక్క రోజులో అకస్మా త్తుగా పశువులు చనిపోతాయి.

● వ్యాధి వ్యాప్తికి కారణాలు

తొలకరి చినుకుల కాలంలో ఈ బ్యాక్టరియా బాగా వృద్ధి చెందుతుంది. పొలాల్లో తడిచిన పచ్చిక తినడం వల్ల ఈ బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. అదేవిధంగా వర్షంలో పశువులు బాగా తడిచి తీవ్ర ఒత్తిడికి గురైన సమయంలోనూ వాయు మార్గంలో బ్యాక్టీరియా ప్రవేశిస్తుంది. వర్షాకాలంలో పశువులను పాకల్లో ఉంచడం ఎంతో మంచిది. ప్రభుత్వం అందిస్తున్న గోకులం పథకాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

1,89,600 డోసులు పంపిణీ చేశాం

పచ్చిక దమ్ము నివారణకు ఏడాదికి రెండుసార్లు ఉచితంగా టీకాలు అందించే కార్యక్రమం జరుగుతుంది. ఇప్పటికే మొదటి విడత పూర్తవగా, రెండో విడత మంగళవారం ప్రారంభమైంది. నెల్లూరు డివిజన్‌కు 93,250, కందుకూరుకు 31,900, కావలి డివిజన్‌కు 64,450 చొప్పున మొత్తం 1,89,600 డోసులు పంపిణీ చేశారు. పశువైద్యులు, సిబ్బంది పాడిరైతుల ఇంటి వద్దకే వెళ్లి ఉచితంగా టీకాలు వేస్తారు. వర్షాలు కురిసే సమయంలో పశువులను పాకల్లో ఉంచడం మంచిది.

- డాక్టర్ జానా చైతన్య కిషోర్, పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ

28 నుంచి పొదలకూరులో రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు

పొదలకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : 69వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలురు, బాలికల రగ్బీ చాంపియన్‌షిప్ 2025 పోటీలు ఈనెల 28వ తేదీ నుంచి 30 వరకు స్థానిక బాలుర హైస్కూల్‌లో అట్టహాసంగా జరుగుతాయని టోర్నమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ, రాపూరు హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు పీ. రమేష్ తెలిపారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభిస్తారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావుతో పాటు పలువురు అధికారులు, క్రీడా ప్రతినిధులు, రాజకీయ నాయకులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. పట్టణ ప్రముఖులు, క్రీడాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

సహిత విద్యను బలోపేతం చేయాలి : డీఈవో

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సహిత విద్యను మరింత బలోపేతం చేయాలని డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఆదేశించారు. నెల్లూరులోని ఇండియన్ మెడికల్ హాలులో మంగళవారం సహితవిద్య కార్యక్రమాలపై విద్యాశాఖాధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సహిత విద్యకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం, ఇతర సదుపాయాలను సక్రమమైన పద్ధతిలో విభిన్న ప్రతిభావంతులకు అందించి ప్రోత్సహించాలని సూచించారు. సమగ్రశిక్ష ఏపీసీ డీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ జిల్లాలోని 38 మండలాల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. విద్యాబోధనతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని కోరారు. అనంతరం భవిత పాఠశాలల పనితీరు, వారి విద్యకు సంబంధించిన అంశాలు, ప్రశస్త యాప్, సదరం సర్టిఫికెట్, యూడిడ్ సర్టిఫికెట్, మెడికల్ క్యాంప్, యూడైస్ వంటి అంశాలపై అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ మల్లికార్జున, ఎంఈవోలు, సమగ్రశిక్ష అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో బాలాజీరావు, పక్కన అధికారులు

క్రీడా వికాస కేంద్రాలకు

మహర్దశ పట్టేనా!?

● ఆత్మకూరు, కావలి కేంద్రాలకు నిధులు

● మిగిలిన వాటి పరిస్థితి ఏమిటో!?

● ప్రభుత్వం స్పందిస్తే క్రీడాకారులకు ఎంతో మేలు



కావలిలో పిల్లర్ల దశలోనే ఉన్న కేవీకే భవనం

నెల్లూరు (విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించి వారిని జాతీయ స్థాయిలో రాణించేలా తయారుచేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం క్రీడా వికాస కేంద్రాలు(కేవీకే)లకు శ్రీకారం చుట్టింది. నియోజకవర్గాల వారీగా వీటిని ఏర్పాటు చేయాలని ప్రకటిస్తూ అన్ని ప్రాంతాల్లో స్థల సేకరణ కూడా పూర్తి చేశారు. నాటి కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు వీటి శిలాఫలకాలను ప్రారంభించి, తొలివిడతగా నిధులు కూడా మంజూరు చేశారు. కోవూరు, ఉదయగిరి, వెంకటగిరి, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాలకు సంబంధించి టెండర్లను సైతం పిలిచి ఒక్కో స్టేడియానికి రూ.2కోట్లు కేటాయించారు. అయితే, నేటికీ ఒక్క కేవీకే కూడా పూర్తి కాకపోవడం విశేషం.

● స్థలాల కేటాయించినా..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 10 నియోజకవర్గాల్లో కేవీకేల ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశారు. ఒక్కో మైదానానికి ఐదున్నర ఎకరాల స్థల సేకరణ కూడా చేపడుతుండగా కోవూరులో ఇబ్బందులు తలెత్తడంతో విడవలూరు జడ్పీ ఉన్నత పాఠశాల స్థలాన్ని కేటాయించారు. ఇక్కడ పనులు ప్రారంభించి సగం పనులు పూర్తి చేశారు. అలాగే ఆత్మకూరులో 10 ఎకరాల్లో పనులు ప్రారంభించగా ఇక్కడా సగం పూర్తయింది. ఉదయగిరిలో 2.70 ఎకరాల్లో కేవీకే పనులు ప్రారంభించి వదిలేశారు. ప్రస్తుతం ఈ స్థలం కూడా జాతీయ రహదారి నిర్మాణంలో సగం పోయింది. కావలిలో 9 ఎకరాల్లో పనులు ప్రారంభించి పెండింగ్‌లో పెట్టారు. సూళ్లూరుపేటలో 10 ఎకరాలు స్థలం ఉన్నా బాగాలేకపోవడంతో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థలాన్ని కేటాయించారు. ఇక్కడ గోడలు కట్టి పనులు ఆపివేశారు. నెల్లూరు రూరల్ మండలం కొత్తూరులో 5.25 ఎకరాలు కేటాయించారు. ఇక్కడ పనులకు సంబంధించిన టెండర్లు కూడా పూర్తవగా తెలుగుగంగ అధికారుల అడ్డగింతతో పనులను నిలిపివేశారు. అదేవిధంగా నెల్లూరు అర్బన్‌లో జాతీయ రహదారి అల్లీపురం సమీపంలో 6 ఎకరాల డంపింగ్ యార్డ్‌ను కేటాయించారు. అయితే డంపింగ్‌ను తొలగించడానికే రూ.3 కోట్ల వరకు ఖర్చవుతుండడంతో నిధుల కొరతతో పనులు నిలిపివేశారు. వెంకటగిరిలో తొలుత 5 ఎకరాలు కేటాయించగా స్థానిక కమిషనర్ దీన్ని అడ్డుకుని టిడ్కో గృహాల అవసరం నిమిత్తం స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంతో పనులు నిలిచిపోయాయి. గూడూరులో ఎస్‌ఆర్‌కే డిగ్రీ కళాశాల సమీపంలో 5 ఎకరాలు కేటాయించినా ఈ ప్రాంతంలో కూడా పనులు ప్రారంభం కాలేదు. వీటన్నింటితో పాటు మండల వికాస కేంద్రాలు కూడా తెరపైకి రాగా జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద తొలుత కోటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానాన్ని కేటాయించారు. దీనికి కూడా రూ.2 కోట్లు కేటాయించిన శాప్ నేరుగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు పనులు అప్పగించారు. ఇక్కడా పనులు ప్రారంభించి సగంలోనే నిలిపివేశారు. ఈ వికాస కేంద్రాల్లో ఇండోర్ స్టేడియంతోపాటు చుట్టూ ప్రహరీ గోడలు నిర్మించి అవుట్‌డోర్ క్రీడలు కూడా ఆడేవిధంగా సిద్ధం చేయాల్సి ఉంది. దీనికోసం ఒక్కో మైదానానికి రూ.2కోట్లు చొప్పున కేంద్రం కేటాయించింది. వీటిని టెండర్లు పిలిచి పనులు ప్రారంభించినా ఆరు కేంద్రాల్లో పనులు ప్రారంభించి నిలిపివేశారు. ఇవి నేటికీ ఒక్కటి కూడా పూర్తి కాలేదు. దీంతో ఈ స్టేడియాలపై నీలినీడలు కమ్ముకున్నాయి.

● 2 కేంద్రాలకు నిధులు విడుదల

ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల్లో కేవీకే నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆత్మకూరు కేంద్రానికి రూ.1.78 కోట్లు, కావలికి రూ.2.78 కోట్లు విడుదల చేయడంతో స్థానిక క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ నిధులతో రన్నింగ్ ట్రాక్, జిమ్, ఇతర క్రీడలకు సంబంధించిన నిర్మాణాలు, భవనాలు పూర్తి చేయనున్నారు. మిగిలిన నియోజకవర్గాలపై కూడా అధికారులు దృష్టి సారించి కేవీకేలు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని క్రీడాకారులు కోరుతున్నారు. దీనిపై డీఎస్‌ఏ అధికారులు మాట్లాడుతూ కేవీకేలకు సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పటికే శాప్ అధికారులకు అందచేశామన్నారు. త్వరలోనే అన్ని కేవీకేలు పూర్తి చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

కళాకారులకు ఉడ్ సరఫరాకు చర్యలు

● విశ్రాంత సీసీఎఫ్ జేఎస్ఎన్ మూర్తి

ఉదయగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉదయగిరి చెక్క నగిషీ కేంద్రంలో కళాకారులు తయారు చేసే చెక్కనగిషీ వస్తువులకు సంబంధించిన ఉడ్‌ను సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు విశ్రాంత సీసీఎఫ్ జేఎస్ఎన్ మూర్తి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్‌బాషాతో కలిసి ఉదయగిరి పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధి చెక్కనగిషీ కేంద్రంలో కళాకారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వస్తువుల తయారీకి కర్ర ఎక్కడ నుంచి తెస్తున్నారు, కొరత ఏమైనా ఉందా, కర్ర తెప్పించేందుకు ఎంత ఖర్చవుతోంది, ప్రభుత్వం మీకు ఏ విధంగా సహాయం అందించాలి తదితర విషయాలను కళాకారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కర్రతో బొమ్మలు, చెక్కనగిషీ, ఇతరత్రా వస్తువులు తయారు చేస్తారన్నారు. కళాకారులకు వస్తువులు తయారు చేసేందుకు తగినంత ఉడ్ సరఫరా లేక కళను వదిలేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. వారికి తగిన సహాయ సహకారాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అందులో భాగంగా అటవీ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు కళాకారులు తయారు చేసే కర్ర కొరత లేకుం డా అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రంలో పలు రకాల వస్తువుల తయారీకి కలివి, వేప, బిల్లనెర్ది, నెర్ది కర్రను అధికంగా ఉపయోగిస్తున్నారన్నారు. వాటిని రిజర్వు ఫారెస్టుతోపాటు రైతుల పొలాల నుంచి సేకరిస్తున్నారన్నారు. అటవీ ప్రాంతం నుంచి ఆయా చెట్ల కర్రను తరలిస్తే భవిష్యత్తులో ఆయా జాతులు అంతరించే ప్రమాదముందన్నారు. అలా కాకుండా కళాకారులు తయారు చేసే చెక్కనగిషీ వస్తువులకు సంబంధించి ఏడాదికి ఎంత కర్ర అవసరమవుతుందని తెలుసుకుని అందుకు అనుగుణంగా అటవీ శాఖ ద్వారా ఉడ్ బ్యాంకు ఏర్పాటు చేసి ఆయా జాతుల మొక్కలను పెంచి వారికి సరఫరా చేసేందుకు వివరాలు సేకరించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందన్నారు. అనంతరం కళాకారులు తయారు చేసిన చెక్కనగిషీ వస్తువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో శ్రీకాంత్‌రెడ్డి, రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా, డీఆర్వో మురళి, ఎఫ్ఎస్‌వో చిన వెంకటయ్య,ఎఫ్‌బీవోలు వెంకటేశ్వర్లు, ప్రసాద్, కేంద్రం నిర్వాహకులు గౌసియాబేగం, కళాకారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత సీసీఎఫ్ జేఎస్ఎన్ మూర్తి

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజులు చెల్లించాలి

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) నిర్వహించే టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఫీజులను డిసెంబరు 10వతేదీ లోపల చెల్లించాలని డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఫీజులను ఏపీఆన్‌లైన్‌లోగానీ, ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా నేరుగాగానీ చెల్లించవచ్చని పేర్కొన్నారు. టెన్త్ ఒక సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ థియరీ సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్స్‌కు రూ.100 చొప్పున ఫీజులు చెల్లించాలన్నారు. అలాగే బెటర్‌మెంట్ రాసే విద్యార్థులకు ఇంటర్ ఒక సబ్జెక్టుకు రూ.250, ప్రాక్టికల్స్‌కు రూ.100 చెల్లించాలన్నారు. ఇంప్రూమెంట్ రాసే టెన్త్ విద్యార్థులు ఒక సబ్జెక్టుకు రూ.200 లు, ఇంటర్ ఒక సబ్జెక్టుకు రూ.300, ప్రాక్టికల్ ఒక సబ్జెక్టుకు రూ.100 వంతున చెల్లించాలన్నారు. టెన్త్ తత్కాల్‌లో రూ.500, ఇంటర్‌కు తత్కాల్‌లో రూ.1000 ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. అభ్యాసకులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా డిసెంబరు 1 నుంచి 10వతేదీ లోపల చెల్లించవచ్చని, రూ.25 అపరాధ రుసుముతో 12వతేదీ వరకు, రూ.50 అపరాధ రుసుముతో 15వ తేదీ లోపల చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని ఓపెన్ స్కూల్స్ కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

జడ్పీ స్టాండింగ్ కమిటీలో సభ్యుల ఏకరువు

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బాగు చేయండి!



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతిపదకిన అభివృద్ధి చేయాలని జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు కోరారు. మంగళవారం నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏడు స్థాయిసంఘాలకు సంబంధించిన అభివృద్ధి పనులు. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, స్త్రీ శిశు సంక్షేమ శాఖలపై సభ్యులు సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో పొదలకూరు రోడ్డులో నిర్మిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యాలయ భవన నిర్మాణాన్ని 15 రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, వెంకట్రావు తదితరులు మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాత ప్రతిపాదనల నివేదికలతోనే సమావేశానికి వచ్చారని, వాటిపై ఎన్నిసార్లు సమీక్షిస్తామని ప్రశ్నించారు. దీంతో తాజా నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. అలాగే వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల ప్రతిపాదనలను జిల్లాపరిషత్‌కి అందించలేదని సభ్యులు తెలపడంతో ఉన్నతాధికారులకు పంపామని అవసరమైతే మరో కాపీని జడ్పీకి పంపుతామని అధికారులు తెలిపారు. 80శాతం పూర్తయిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల భవనాలను పూర్తి చేయకుండా నిరుపయోగంగా ఉంచడం ఏమిటని సభ్యులు ప్రశ్నించడంతో ప్రభుత్వ ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పథకాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయని, సభ్యులు తెలపటంతో వాటిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి శుభ్రం చేస్తామని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

తిరుపతిలో సంస్కృత ప్రాంతీయ కార్యాలయం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సంస్కృత భాష పరిరక్షణ కోసం తిరుపతిలో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ తెలు గు, సంస్కృతం అకాడమీ అధ్యక్షుడు ఆర్డీ విల్సన్ తెలిపారు. మంగళవారం ఆయనను నెల్లూరులో పలువురు రచయితలు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ అకాడమీ ఆధ్వర్యంలో గతంలో వస్తున్న పత్రికను పునరుద్ధరిస్తామని తెలిపారు. అందరితో కలిసి తెలుగుభాషా పరిరక్షణ కోసం కృషి చేస్తామన్నారు. తెలుగుజాతి అస్తిత్వం భాషా పరిరక్షణ ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో రచయితలు శరత్‌చంద్ర, పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న ఎంఎల్ఎస్ గోదాము తలుపులు

● నిల్వలు పరిశీలించిన అధికారులు

● బియ్యం స్వాహాపై పోలీసులకు ఫిర్యాదు

● సమగ్రంగా ఇవ్వాలన్న పోలీసులు



ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములో నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరిలో సీజ్ చేసిన ఎంఎల్ఎస్ గోదాము తలుపులను పౌరసరఫరాల శాఖ అధికారులు మంగళవారం తెరిచి నిల్వలను పరిశీలించారు. ఈ నెల 21వ తేదీ అర్ధరాత్రి గోదాములో అధికారులు పరిశీలించ గా, బియ్యం నిల్వలు, రికార్డుల్లో ఉన్న నిల్వలకు భారీస్థాయిలో తేడా ఉన్నట్లు గుర్తించారు. సుమారు 4,250 బస్తాల బియ్యం స్వాహాకి గురైనట్లు నిర్ధారించి గోదామును సీజ్ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పౌరసరఫరాల శాఖ ఏఎంటీ లక్ష్మీనారాయణ, సీఎస్ డీటీ పవన్‌లు బియ్యం స్వాహా, గోదాములో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై ఫిర్యాదు చేసేందుకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే, సమగ్ర వివరాలు, శాఖ పరమైన విచారణ నివేదిక లేకుండా ఫిర్యా దు చేయడంతో పోలీసులు ఫిర్యాదు తీసుకునేందుకు నిరాకరించారు. ఎప్పటి నుంచి బియ్యం నిల్వల్లో తేడాలు ఉన్నాయి, ఇందు లో ఎవరెవరి హస్తం ఉంది తదితర వివరాలతో సమగ్ర నివేదికతో ఫిర్యాదు ఇవ్వాలని పోలీసులు అధికారులకు సూచించారు. అయితే ఆ వివరాలన్నీ సమగ్రంగా లేకపోవడంతో వారు పోలీస్‌స్టేషన్ నుంచి వెనుతిరిగారు.

● సూత్రధారులెవరో తేలేనా!?

ఉదయగిరి ఎంఎల్ఎస్ పాయింట్‌లో 4,250 బియ్యం బస్తాలు పక్కదారి పట్టడంలో సూత్రధారులెవరో.. పాత్రధారులెవరో తేలేనా అని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో ఈ పాయింట్ నుంచి అక్రమంగా బియ్యం రవాణా చేస్తూ పట్టుబడిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఆ సమయంలో ఆ శాఖాధికారులు మామూళ్ల మత్తులో జోగి విచారణను నీరుగార్చిన సంఘటనలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో బియ్యం స్వాహాపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గోదాములో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఇంతటి స్వాహా చేపట్టే ధైర్యం లేదు. దీని వెనుక కొంతమంది పెద్దల హస్తం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. అయితే తమను ఇబ్బందులకు గురి చేస్తే బియ్యం స్వాహా చేసిన వారి వివరాలు బయట పెడతామని గోదాము సిబ్బంది హెచ్చరిస్తున్నట్లు సమాచారం. దీంతో అసలు స్వాహారాయుళ్లు ఎక్కడ తమ గుట్టురట్టవుతుందోనని లోలోన మదనపడుతూ విచారణ నీరుగార్చేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ఆర్టీసీ బస్సు కొనసాగింపుపై హర్షం

అనంతసాగరం నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు డిపో నుంచి సోమశిలకు నడుపుతున్న ఆర్టీసీ బస్సు సర్వీసులు హిల్ కాలనీ వరకు కొనసాగించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కొన్నాళ్లుగా బస్టాండ్ వరకు వచ్చి బస్సులు వెనుతిరిగేవి. దీంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడేవారు. సమ స్యను స్థానిక నాయకులు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి తెలపడంతో బస్సు సర్వీసులు కాలనీ వరకు వచ్చేలా అధికారులు చర్యలు తీసు కున్నారు. దీంతో మంత్రికి ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11,962
వెండి కిలో ధర	రూ. 1,60,800
వెండి ఒక గ్రాము	రూ. 165.80

సోమశిలలో రూ. 20 లక్షలతో సీసీ రోడ్లు



సోమశిలలో రోడ్డు నిర్మాణ పనులు

అనంతసాగరం నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని సోమశిల హిల్, క్యాంపు కాలనీల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేసింది. దీంతో పనులు ప్రారంభమయ్యాయి. మంత్రి ఆనం చొరవతో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ఆయా కాలనీల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

గెవిటి రాళ్ల ప్రతిష్ఠ



సీతలాంబ, పోలేరమ్మ గెవిటి రాళ్లు

సంగం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనసూయనగర్లో మంగళ వారం సీతలాంబ, పోలేరమ్మ గెవిటి రాళ్ల ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి నాలుగు దిక్కుల గెవిటి రాళ్లను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు నిధుల మంజూరు

సంగం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేసినట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరు క్యాంప్ కార్యాలయంలో వెల్లడించారు. ఒక్కో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనానికి రూ. 36 లక్షల చొప్పున మండలంలోని మర్రిపాడు, సంగం -1 లో రెండు హెల్త్ క్లినిక్‌లకు మొత్తం రూ. 72 లక్షలు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలో నిర్మాణానికి టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. వీటితోపాటు జిల్లాలో 27 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు రూ. 9.72 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు.

టార్పాలిన్ల కోసం అన్నదాతల ఎదురుచూపు



పంటపై కప్పిన టార్పాలిన్ (ఫైల్)

మర్రిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కాపాడుకునేందుకు సహాయపడే టార్పాలిన్లను రైతులకు అందించటానికి వ్యవసాయ శాఖ ముందుకు రావటం లేదు. పంట నూర్పిడి చేసే సమయంలో అకాల వర్షాలు కురిస్తే వీటినుంచి రైతులకు ప్రయోజనం ఉంటుంది. గత తేదేపా పాలనలో ప్రతీ రైతుకు రాయితీ పై వీటిని అందించే వారు. వైకాపా ప్రభుత్వంలో వీటి పంపిణీలో రైతులకు మొండి చేయి చూపింది. అప్పటి నుండి వీటిని పూర్తిస్థాయిలో అద్దెకు తెచ్చుకొని పంటలను కాపాడు కుంటున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో అనంతసాగరం, చేజర్ల, సంగం, ఏఎస్ పేట మండలాల్లో అధిక శాతం రైతులు వరిసాగు చేస్తున్నారు. వాతావరణం కలిసిరావటంతో పాటు ఏపుగా పెరుగుతుంది. పండిన పంటలు డిసెంబరులో కోతలు కోస్తారు. ఈ సమయంలో వర్షాలు కురిస్తే టార్పాలిన్లు చాలా ఉపయోగపడుతాయి. వీటి బహిరంగ మార్కెట్‌లో వీటి ధర రూ 2 వేల నుంచి, రూ 3 వేలవరకు పలుకుతోంది. కాగా రైతులకు టార్పాలిన్లు చాలా అవసరమని, ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించామని మండల వ్యవసాయాధికారిణి ఎస్. కవిత తెలిపారు. టార్పాలిన్లు ఇవ్వాలని రైతు సేవాకేంద్రాల్లో అడుగుతున్నారన్నారు. గతంలో వీటిని రాయితీపై అందించామని, ఇప్పుడు మళ్లీ అందించటానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

ఆత్మకూరు, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో మంగళవారం ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. డిపో అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ ఏలూరు ఆర్టీసీ డిపోలో ఎస్ డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ సుంద రయ్యతో పాటు మరి కొందరు కార్మికులను అకార ణంగా సస్పెం డ్ చేయడం అన్యా యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సేవా దృక్పథాన్ని పెంపొందించడమే ధ్యేయం

చేజర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం మండ లం లోని గొల్లపల్లి పంచాయతీలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహించారు. విద్యార్థులలో సేవా దృక్పథం పెంపొందించడమే లక్ష్యంగా వారం రోజులు పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీజ్ఞానేశ్వరి, టీడీపీ నాయకుడు హజరత్తయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ కాన్పులపై దృష్టి పెట్టండి: ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో పావని

ఆత్మకూరు, నవంబరు25 (ఆం ధ్ర జ్యోతి) : ప్రభుత్వ వైద్యశాలలో ఇటీవల సిజేరియన్ కాన్పులు ఎ క్కువగా నమోదవుతున్నాయని, ఇ కపై సాధారణ కాన్పులు చేయ డంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీవో బీ పావని తెలిపారు. స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో మంగళవారం వైద్యులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలలో కాన్పుల వివరాలు, రోగుల సంఖ్య, వసతులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ యాప్‌లో ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందే రోగుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. ప్రైవేట్ వైద్యశాలలకు దీటుగా రోగులకు వైద్యసేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ మునికృష్ణ, వైద్యులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, రైతులు

చేజర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మండల వ్యవసాయ శాఖాధికారి హిమబిందు తెలిపారు. మంగళవారం మండలంలోని తూర్పుపల్లి, ఆదురుపల్లి, మాము డూరు, చిత్తలూరు, పాతపాడు తదితర గ్రామాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు రైతులతో కలసి 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు పథకాలపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి రైతుల సమస్యలు తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు, వ్యవసాయశాఖ సహాయ కులు పాల్గొన్నారు.

పీఎంపీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విచారణకు ఆదేశం

సంగం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓ ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ (పీఎంపీ)పై సంగం గ్రామానికి చెందిన సలీమ్ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. సలీమ్ తన 11 ఏళ్ల కుమారుడిని కాలి చికిత్స కోసం స్థానిక పీఎంపీ వద్దకు తీసుకెళ్లాడు. బాలుడిని పరీక్షించిన పీఎంపీ ఓ ఇంజక్షన్ రాయగా, నర్సు ఇంజక్షన్ చేసింది. నయం కాకపోవడంతో మళ్లీ వెళ్లగా ఈసారి పీఎంపీ వైద్యుడే బాలుడి కాలికి ఇంజక్షన్ వేశారు. అది వికటించడంతో తీవ్ర జ్వరం, నొప్పితో బాలుడు నడవలేకపోయాడు. దీంతో బాధితుడు అల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు బాలుడిని తీసుకెళ్లగా పీఎంపీ ఇచ్చిన ఇంజక్షన్ ఇన్ఫెక్షన్ అయిందని చెప్పారు. అక్కడి డాక్టర్ కాలికి ఆపరేషన్ చేశారు. కనీస అవగాహన లేని పీఎంపీ వైద్యుడివల్ల తన కుమారుడు తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడని, ఈ సంఘటనపై విచారించి అతడిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, విచారణ చేయాలని డీఎం అండ్ హెచ్‌వోను కలెక్టర్ ఆదేశించినట్లు బాలుడి తండ్రి సలీం తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉదయగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వరాబాదు గ్రామ సమీపంలో 167-బీజీ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఘైదుకూరు శ్రీనివాసులు(39) మంగళవారం మృతి చెందాడు. ఈనెల 19న శ్రీనివాసులు ద్విచక్ర వాహనంపై వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం కృష్ణంపల్లి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో సర్వరాబాదు వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి బోల్తాపడడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతని మృతితో పట్టణంలోని మంగళగిరి కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పోలీసులను పరుగులు పెట్టించిన ఫోన్ కాల్

ఉదయగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసులను మంగళవారం ఓ వ్యక్తి చేసిన ఫోన్ కాల్ పరుగులు పెట్టించింది. వివరాల మేరకు.. భర్తను బంధువులతో కలిసి భార్య దారుణంగా కొట్టి చంపి కొత్తపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో ఉన్న పాడుబడిన బావిలో పడేశారని ఓ వ్యక్తి 100కు ఫోన్ చేశాడు. దీంతో పోలీసులు జిల్లాలోని పలు మండలాల్లో కొత్తపల్లి పేరుతో ఉన్న గ్రామాల్లో ముమ్మర విచారణ చేపట్టి అటవీ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఎక్కడా ఎలాంటి ఆచూకీ లభ్యం కాకపోవడంతోపాటు ఫోన్ కాల్ చేసిన వ్యక్తి ఎవరా అని ఆరా తీశారు. తీరా ఆ వ్యక్తి ఉదయగిరి మండలం బిజ్జంపల్లి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని వ్యక్తిగా నిర్ధారణ కావడంతో మిన్నకుండిపోయారు.

మద్యం బెల్టుషాపు వద్దంటూ నిరసన

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): విరువూరు, కోటవర్ధనిపల్లి గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు వద్దంటూ మంగళవారం మహిళలు నిరసన చేపట్టారు. నిర్వాహకులు ఇష్టానుసారంగా అమ్మకాలు సాగిస్తుండడంతో కుటుంబాల్లో వివాదాలు తలెత్తుతున్నాయన్నారు. కూలినాలి చేసుకుని సంపాదించిన నగదును మద్యానికే ఖర్చు చేస్తున్నారని వాపోయారు. అమ్మకాలు నిలిపివేయాలని దుకాణదారులను ప్రశ్నిస్తే తమపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందని, ఇప్పటికైనా మద్యం బెల్టు దుకాణాన్ని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.

కోర్టు ఆవరణలో అత్తపై అల్లుడు, బంధువుల దాడి

కావలి రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కోర్టు ఆవరణలో అత్తపై అల్లుడు, అతని బంధువులు దాడి చేసిన ఘటన మంగళవారం కావలి పట్టణంలో జరిగింది. 1వ పట్టణ పోలీసులు, బాధితుల వివరాల మేరకు... పట్టణానికి చెందిన పూనూరు గీతాంజలికి దగదర్తి మండలం మనుబోలుపాడుకు చెందిన చేజర్ల మహేష్‌రెడ్డికి 2016లో వివాహం జరిగింది. అనంతరం వారి మధ్యన ఏర్పడిన మనస్పర్థలతో మహేష్‌రెడ్డిపై 2021లో వరకట్నం, వేధింపుల కేసు నమోదైంది. ఈ కేసు విషయమై గీతాంజలితో పాటు ఆమె తల్లి కామాక్షి కోర్టుకు రాగా కేసు జనవరి 28కి వాయిదా పడింది. దీంతో వారు కోర్టు నుంచి తిరిగి వెళ్తుండగా ఆ కేసులో నిందితులైన మహేష్‌తో పాటు ఆయన తండ్రి మహేందర్‌రెడ్డి, వారి బంధువు రమేష్‌రెడ్డిలు కోర్టు ప్రాంగణంలోనే కామాక్షమ్మను చెప్పుతో కొట్టి దాడి చేసినట్లు బాధితురాలు వాపోయింది. దీంతో బాధితురాలు 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ ఫిరోజ్ ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాధితురాలు ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అయితే భార్యాభర్తల మధ్య జరుగుతున్న కోర్టు గొడవలకు ప్రధాన కారణం ఓ టీడీపీ నాయకుడేనని బాధితురాలు గీతాంజలి విలేకరుల ఎదుట వాపోయింది. నా భర్త లేని సమయంలో మా ఇంటికి వచ్చి నన్ను హింసించడంతో పాటు నాపై కేసులు పెట్టించి మా కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసి నాబిడ్డను ఇవ్వకుండా చేశాడని, పోలీసులను ఆశ్రయిస్తే నాబిడ్డను ఇచ్చారన్నారు. అప్పటి నుంచి మమ్మల్ని వేధిస్తున్నాడని, మాపై ఈ దాడికి అతనే ప్రధాన కారణమని గీతాంజలి వాపోయింది.జ

ఆత్మహత్యకు కారకుల అరెస్ట్

నెల్లూరు(క్రైం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : యువకుడు ఆత్మహత్య చేసుకునేందుకు కారకులైన నలుగురిని నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ స్టేషన్‌లో మంగళవారం నగర ఇన్‌చార్జి డీఎస్పీ ఎం గిరిధర్ కేసు వివరాలు వెల్లడించారు. వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన రోహిత్(17) అనే యువకుడిపై ఈ నెల 4వ తేదీన ప్రేమ వ్యవహారం నేపథ్యంలో అదే ప్రాంతానికి చెందిన కరిముల్లా, ఉమేరా, ఆసీఫ్, మహబూబ్ బాషా, మరో ఇద్దరు బాలలు దాడిచేశారు. దీంతో మనస్థాపానికి గురైన రోహిత్ ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. అతని తండ్రి వెంకయ్య ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి డీఎస్పీ గిరిధర్ కేసు దర్యాప్తు చేపట్టారు. యువకుడి ఆత్మహత్యకు కారకులైన నలుగురిని అరెస్ట్ చేశారు. ఇద్దరు బాలలను అదుపులోకి తీసుకుని జువైనల్ హోమ్‌కు తరలించారు.

భార్యతో గొడవపడి భర్త బలవన్మరణం

నెల్లూరు రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవపడిన ఓ భర్త బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు రూరల్ ప్రాంతం కోడూరుపాడు గిరిజనకాలనీకి చెందిన పొట్లపూడి చెంచయ్య (21) ఈ నెల 23వ తేదీన తన భార్య ఆఫ్రీన్‌తో గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో పురుగుల మందు తాగాడు. అది గమనించిన భార్య స్థానికుల సహాయంతో చెంచయ్యను జీజీహెచ్‌కు తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.


డిపో ఎదుట ఎస్‌డబ్ల్యూఎఫ్ నేతల నిరసన



డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఉదయగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏలూరు ఆర్టీసీ డిపోలో అక్రమంగా సస్పెన్షన్ చేసిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఎస్‌డబ్ల్యూఎఫ్ నేతలు మంగళవారం డిపో ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఏలూరు డిపోలో పెట్రోల్ బంకులో జరిగిన అవకతవకలకు సంబంధించి అసలు దోషులను వదిలి సంబంధంలేని వారిని సస్పెన్ చేయడం దారుణమన్నారు. ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు సుందరయ్యను కూడా కక్షసాధింపు చర్యలతో సస్పెన్షన్ చేయడం సిగ్గుచేటన్నారు. ఈ సస్పెన్షన్లను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారి సస్పెన్షన్లు రద్దు చేసి తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్తాని, రవికుమార్, రవిబాబు, రవి, సురేష్, మనోహర్ ఖాన్‌సా తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం



ర్యాలీలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

సీతారామపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణప్పపేటలో మంగళవారం స్థానిక సీతారామ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ నెల 27వ తేదీ వరకు ఎన్ఎస్ఎస్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. అనంతరం గ్రామంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీతారామ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నరసింహారెడ్డి, ప్రిన్సిపాల్ ఉమాశంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేష్, భాస్కర్‌రెడ్డి, బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు పొడిగింపుపై హర్షం

ఉదయగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి గ్రామం వరకు ఆర్టీసీ అధికారులు బస్సు పొడిగింపుపై గ్రామస్తులతోపాటు సర్పంచ్ లక్కు రమణమ్మ, రాష్ట్ర కన్స్యూమర్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం డివిజన్ అధ్యక్షుడు భేరి తిరుపాలురెడ్డిలు మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జీ.చెరువుపల్లి వరకే ఉండే ఈ బస్సు సర్వీసును విద్యార్థులు, గ్రామస్తుల సూచన మేరకు బండగానిపల్లి వరకు పొడిగించడంతో ఆర్టీసీ డిపో మేనేజర్ మేనేజర్ రమేష్‌కు మార్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే కాకర్లతో కలసి పుష్పగుచ్ఛం అందిస్తున్న డాక్టర్ హైమావతి

జలదంకి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆయన ముందుగా అన్నవరంలో చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరు ఔట్ ఫాల్ వద్ద పూజలు చేసి రిజర్వాయరు నుంచి గేట్లు ఎత్తి కావలి కాలువ దిగువనున్న మేజర్, మైనర్ కాలువలకు సాగునీరు విడుదల చేశారు. అనంతరం జలదంకిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొని రైతుల ఇళ్లకు వెళ్లి అన్నదాత సుఖీభవ కింద కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందించిన రూ.14వేలు సాయంపై రైతుకుటుంబాలతో ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో సోమశిల ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ పీ.మధుమోహన్‌రెడ్డి, జలదంకి పీఏసీఎస్ అధ్యక్షుడు కరియావుల అప్పలయ్యనాయుడు, టీడీపీ మండల కళఅధ్యక్షుడు మునగాల తిరుమల రెడ్డి, వింజమూరు ఏడీఏ శేషగిరిరావు, ఏవో శ్రీవాణి, నాయకులు పూనూరు భాస్కర్‌రెడ్డి, పచ్చా పెంచలయ్యనాయుడు, అంబటి హరిప్రసాద్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

● సీఎంతో ఎమ్మెల్యే కాకర్ల దంపతుల భేటీ

ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రవీణ దంపతులు మంగళవారం సీఎం చంద్రబాబు నాయుడుతో అమరావతిలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అమెరికాలో స్థిరపడ్డ రాష్ట్రానికి చెందిన డాక్టర్ హైమావతి మిక్కిలినేనిని ఎమ్మెల్యే కాకర్ల దంపతులు సీఎంకు పరిచయం చేశారు. ఆమె సీఎంకు పూలబొకే అందజేసి అభినందనలు తెలిపారు. సీఎం ఎన్ఆర్ఐ వైద్యురాలితో సుదీర్ఘంగా యుఎస్‌లో వైద్య విధానంపై చర్చించారు. ఎమ్మెల్యే కాకర్ల ఉదయగిరి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు సాగు, తాగునీటి ప్రాజెక్టులను సీఎం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పూర్తి చేయించాలని కోరారు.

స్పోర్ట్స్ మీట్‌లో సత్తాచాటిన విద్యార్థులు



క్రీడల్లో సత్తాచాటిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఉదయగిరి, నవంబరు 25(ఆంధ్ర జ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో మంగళవారం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ఉదయగిరి నియోజకవర్గ బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొని ఖోఖోలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను ఓడించి ప్రథమస్థానంలో నిలిచారు. అలాగే వంద మీటర్ల పరుగుపందెంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు గుంటుపల్లి శ్రీనివాస్,పీడీ వెంకటసురేష్; సుబ్బయ్య, ఏడుకొండలు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

సీతారామపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం డీఆర్‌డీఏ, వెలుగు సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీ వో చంద్రశేఖర్ మాట్లాడుతూ క్లీన్ అండ్ గ్రీన్ థీమ్‌పై శిక్షణలో భాగంగా గ్రామ పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, సంపద సృష్టి, పచ్చదనం పెంపు, సేంద్రియ వ్యవసాయం, పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించడం, పునరుత్పాదక శక్తి వనరుల వాడకం, నీటి సంరక్షణ వంటి అంశా లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఎంపీడీవో శివ ప్రసాదరావు, ఏపీ ఎం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ షఫీ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ షెల్టర్‌కు మరమ్మతులు



బస్ షెల్టర్‌కు రంగులు వేయిస్తున్న అధికారులు

సీతారామపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కార్యాలయాల ఎదురుగా ఉన్న ఏపీఎస్ఆర్టీసీ బస్‌షెల్టర్‌కు మంగళవారం ఉదయగిరి డిపో అసిస్టెంట్ మేనేజర్ నాగభూషణం, ఏడీసీ వెంకటేశ్వర్లు, నాగయ్యలు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా డిపో అసిస్టెంట్ మేనేజర్ నాగభూషణం మాట్లాడుతూ బీజేపీ నేత ముడమాల రమేష్‌రెడ్డి, కండక్టర్ నల్లి పెంచలమ్మ సౌజన్యంతో బస్ స్టేషన్‌కు పెయింటింగ్‌తో పాటు జేసీబీతో పరిసరాలను పరిశుభ్రం చేయించామని, త్వరలోనే ఆర్టీసీ బస్సులన్నీ బస్‌స్టేషన్ ప్రాంగణంలోకి వచ్చేలా చర్యలు చేపడు తున్నామన్నారు.

ఏపీ ఎన్‌జీజీవో అధ్యక్షుడికి సన్మానం

దుత్తలూరు(ఉదయగిరి), నవంబరు 22(ఆంధ్ర జ్యోతి): మండలంలోని నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉదయగిరి తాలుకా ఏపీ ఎన్‌జీజీవో అధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన షేక్ రియాజ్‌ను వైద్యులు, సిబ్బంది సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మనోజ్ఞ, విశ్రాంత టీపీఎం ఓ.నాగరాజు, ఆరోగ్య పర్యవేక్షకుడు షఫీ, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌జీజీవో అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఉద్యోగులు

మీరైనా స్పందించాలిక!

(5వ పేజీ తరువాయి)

వచ్చింది. ఇప్పుడైనా ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకంపై అధికారులు, పాలకులు దృష్టి సారిస్తారా!? అని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. తక్కువ ధరకు శుద్ధిజలం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుకొంటున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను వివరణ కోరగా ఈ పథకం పునఃప్రారంభానికి సంబంధించి డీటైల్ ప్రాజెక్టు రిపోర్టు ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు. ఈ ప్రతిపాదన ఎప్పుడు ప్రభుత్వానికి అందుతుందో, కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

ఒకరికి ఒక ఓటే!

(5వ పేజీ తరువాయి)

నమోదై ఉంటే దీనికి కారణాలేమిటి? అప్పట్లో వీరి కుటుంబ సభ్యులు పేర్లు ఉన్నాయా అనే కోణంలో మ్యాపింగ్ చేస్తున్నారు. ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్నవారిని స్థానికులుగా గుర్తించటంతోపాటు మిగిలిన వారిని వలస ఓటర్లుగా భావించి ఇతర కేంద్రాలలో వారికి ఓటు హక్కు ఉందేమోనని ఆరా తీస్తున్నారు. పాత జాబితాలో పేరుండి, ప్రస్తుత జాబితాలో లేని వారి వివరాలు కూడా సేకరిస్తున్నారు. అంతేగాక 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరించటంతోపాటు మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగిస్తారు. కాగా, జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో 2002లో 15,53,923 మంది ఓటర్లు ఉండగా, 2025లో 19,50,825 మంది ఓటర్లు ఉన్నారు. 2002 కంటే 2025 నాటికి 3,96,902 ఓటర్లు పెరిగారు.

పారదర్శక జాబితా కోసమే

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించనున్నాం. ఓటర్ల జాబితా కచ్చితత్వం, సమగ్రత, స్వచ్ఛీకరణకు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన చర్యలలో భాగంగా జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతోంది.

- విజయకుమార్, జిల్లా రెవెన్యూ అధికారి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	117
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 660

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి

వలేటివారిపాలెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఏపీఎం శ్రీనివాసులు తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు జాతీయ ప్రచారం జెండర్ సమానత్వం కోసం కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ అన్ని రంగాల్లో పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కు కలిగి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌రావు, ఏపీవో దయాసాగర్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభ్యసన కిట్లు అందజేత

వలేటివారిపాలెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లె ఎంపీపీ స్కూల్‌లోని విద్యార్థులకు ఆటల ద్వారా అభ్యసనం కిట్లను డైట్ పరిశీలకుడు సంగా మహేంద్ర మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ కిట్ల ద్వారా ప్రాథమిక తరగతుల భాష, గణితం సులభ స్థాయిలో విద్యార్థులు అభ్యసనం పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సుజాత, రజిత, హనుమంతరావు, వెంకట్రావు, శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతులు లేని ఇళ్లల్లో చేర్చేదెలా?

- పెరుగుతున్న ప్రభుత్వం ఒత్తిడి
- ముందుకు రాని లబ్ధిదారులు
- టిడ్కో గృహాల కేటాయింపు ప్రశ్నార్థకం
- అధికారులు సతమతం


మద్దూరుపాడులోని టిడ్కో గృహాలు

కావలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి పేదవాడికి సొంతింటి కల నిజం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం తొలివిడతగా టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించి వాటిలో చేర్చాలని అధికారులపై ఒత్తిడి తెస్తోంది. అయితే కనీస మౌలిక వసతులు లేక అందులో చేరేందుకు లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో అధికారులు సతమతం అవుతున్నారు. వివరాల మేరకు.. కావలి పట్టణం మద్దూరుపాడులో 2112 టిడ్కో గృహాలను గతంలో అప్పటి టీడీపీ హయాంలో నిర్మించగా ఇప్పటికీ వాటిల్లో కేవలం 350 ఇళ్లల్లో మాత్రమే నివాసాలు ఉంటున్నారు. వారు కూడా ఇక్కడ తాము ఉండలేమని లబోదిబోమంటున్నారు. టిడ్కో గృహాలు చెరువు లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షాకాలం పూర్తిగా మునకకు గురై ఇళ్లల్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు చుట్టూ ప్రహరీ లేకపోవడం ముళ్లచెట్లు, పిచ్చిచెట్లు గడ్డితో ఉండడంతో విషసర్పాలు తిరుగుతున్నాయనే భయాందోళనలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో టిడ్కో ఇళ్లలో లబ్ధిదారులను చేర్పించటం అధికారులకు తలకు మించిన భారంగా మారింది. ప్రస్తుతం నివాసం ఉంటున్న వారు కూడా నిత్యం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి వద్దకు వెళ్లి వసతులు సమకూర్చనదే తాము ఉండలేమని చెబుతున్నారు. దీంతో ఎమ్మెల్యే కూడా అక్కడ కనీస వసతులు సమకూర్చే వరకు ఎవరిని చేర్చవద్దని అధికారులకు సూచిస్తున్నారు. అయితే ఉన్నతాధికారులు మాత్రం టిడ్కో ఇళ్లలో పూర్తి స్థాయిలో లబ్ధిదారులను చేర్చి పేదోళ్ల సొంతింటి కలను నెరవేర్చాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

● 2112కి 350 ఇళ్లల్లోనే నివాసం

టిడ్కో గృహాలను మూడు కేటగిరిల కింద విభజించి 300 చ.అ లలో 704, 365 చ.అ లలో 864, 430 చ.అ లలో 544 ఇళ్లు వంతున 2112 ఇళ్లు నిర్మించారు. వాటిని గత తెలుగుదేశం ప్రభుత్వంలోనే అందరికీ కేటాయించగా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాజకీయం చేసి చాలా టిడ్కో ఇళ్ల కేటాయింపులను గందరగోళం చేసింది. దీనికి తోడు గతంలో అక్కడ ఆగిపోయి ఉన్న మైనర్ వర్క్‌లను కూడా పూర్తిగా వదిలివేయడంతో ఆ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లు పక్కన పడేశారు. అయితే మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిపై దృష్టి పెట్టగా అప్పటికే చాలా మందికి 60 ఏళ్ల వయస్సు దాటడంతో బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రాలేదు. మరికొందరికి వయస్సు ఉన్నా బ్యాంకు లావాదేవీలకు సిబిల్ స్కోర్ సరిగా లేదని చెప్పి బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడంలేదు. దీంతో అధికారులు పూర్తి సొమ్ము చెల్లిస్తే ఇళ్లు మీకు రిజిస్టర్ చేస్తామని చెబుతున్నారు. అయితే అక్కడ కనీస వసతులు లేక వర్షం వస్తే మునకకు గురవుతుండటంతో పూర్తి డబ్బులు చెల్లించేందుకు లబ్ధిదారులు ఎవరూ ముందుకు రావడంలేదు. ఇప్పటి వరకు బ్యాంకు రుణాలతో 1408 ఇళ్లు రిజిస్టర్లు అవ్వగా వాటిల్లో 1224 ఇళ్లకు సంబంధించిన తాళాలను కూడా లబ్ధిదారులకు అప్పగించారు. వారిలో 422 మంది ఇళ్లలో చేరగా అక్కడ వసతులు లేమి కారణంగా వారిలో 350 మంది మాత్రమే అతికష్టం మీద నివాసం ఉంటున్నారు. ఈ పరిస్థితులలో టిడ్కో గృహాలలో పూర్తి స్థాయిలో లబ్ధిదాలను చేర్చే విషయం అధికారులకు తలనొప్పిగా తయారైంది. అక్కడ నివాస యోగ్యంగా అవసరమైన వసతులు సమకూరే వరకు టిడ్కో గృహాల్లోకి వచ్చేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. దీంతో అక్కడ కనీస వసతులు ఎప్పుడు సమకూరుతాయో, లబ్ధిదారులు ముందుకు వస్తారా, రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు సహకరిస్తారా, ప్రభుత్వ ఒత్తిడి నుంచి తాము బయటపడతామోనన్న విషయం అధికారవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ


పడిపూజ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు

బిట్రగుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం అయ్యప్ప స్వామి పడిపూజా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వాములు గణాధి బాబురావుస్వామి, సూరపనేని శివరామకృష్ణస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజకు అయ్యప్ప స్వామి మాలధార భక్తులతో పాటు శివమాలధార భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మునగాల జనార్దన్‌రెడ్డి, పసుపులేటి సుబ్బారావు, గంజి వెంకటేశ్వర్లు, కడియాల వెంకయ్య, పసుపు లేటి రఘు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వివక్ష తగదు : ఏపీఎం

కొండాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలపై వివక్ష చూపకూడదని ఏపీఎం కాంతారావు పేర్కొన్నారు. కొండాపురంలో మంగళవారం జెండర్ వివక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉన్నత విద్య, ఉద్యోగాలలో సమాన అవకాశాలు పొందేలా బాలికలను ప్రోత్సహించడం, మహిళలకు పురుషులతోపాటు సమాన వేతనం, హింస నుంచి బయటపడిన మహిళలు, ఒంటరి మహిళలకు ఆర్థిక, వ్యక్తిగత మద్దతు అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, టీడీపీ మండల కన్వీనర్ పోలినేని చంద్రబాబునాయుడు, గుడవళ్లూరు సర్పంచు మాచర్ల, జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాధాక్రిష్ణ, ఏపీవో మురళీధరరావు పాల్గొన్నారు.

స్త్రీల రక్షణ చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్త్రీలకు రక్షణగా రూపొందించిన చట్టాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాదులు వీ.వసంతలక్ష్మి, ఎం.మనోహర్‌లు కోరారు. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయవాదులు మాట్లాడుతూ గృహహింస, దాడులు అన్నిటికీ ప్రత్యేక రక్షణచట్టాలు ఉన్నాయని వివరించారు. సమాజంలో మహిళల పట్ల గౌరవం కలిగి ఉండాలని తెలిపారు. సీడీపీఓ ఉషారాణి, సూపరింటెండెంట్ ఎస్కే షకీలా పాల్గొన్నారు.

విచారణ నిష్పక్షపాతంగా చేయాలి


మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాసులు

లింగసముద్రం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రారంభమైన సోషల్ ఆడిట్ విచారణను ఎస్‌ఆర్‌పీ, డీఆర్‌పీలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఉపాధి హామీ పథకం కందుకూరు ఏపీడీ ఎం.శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని ఉపాధి హామీ గదిలో అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ తనిఖీలు గతంలో మాదిరిగా అన్ని పంచాయతీల్లో ఒకేసారి విచారణ జగరదని చెప్పారు. రెండు పంచాయతీలకు ఒకసారి, అవి ముగిసిన తరువాత మరో రెండు పంచాయతీలలో విచారణ జరుగుతుందన్నారు. ఈ విధంగా మండలంలోని 16 పంచాయతీలలో విచారణ పూర్తి చేసిన అనంతరం జనవరి నెలలోగా సోషల్ ఆడిట్ ప్రజావేదికను నిర్వహించి, విచారణ నివేదికను బహిర్గతం చేస్తామన్నారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి నెల 31వ తేదీ వరకు మండలంలో రూ9.75 కోట్లకు పనులు జరిగాయని తెలిపారు. వీటన్నింటిపై విచారణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో షేక్ సమీర్‌బాషా, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రూ.143 కోట్లతో పట్టణాభివృద్ధి

- 10వ వార్డులో ఇంటింటికి టీడీపీలో ఎమ్మెల్యే


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణాభివృద్ధికి రూ.143 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఇందులో తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చామని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఆయన పట్టణంలోని 10వ వార్డులో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని సత్వర పరిష్కారంలో భాగంగా సమస్య మీది పరిష్కారం మాది అంటూ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచేందుకు రూ.80 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేయగా రూ.32 కోట్లు మంజూరయ్యాయన్నారు. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు రూ.43 కోట్లు మంజూరయ్యాయన్నారు. పైపులైన్లు మరమ్మతులకు రూ.7 కోట్ల మంజూరయ్యాయన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.13 కోట్ల మంజూరైనట్లు తెలిపారు. మౌలిక వసతులకు రూ.75 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, నాయకులు జీ.కిషోర్, జ్యోతి బాబూరావు, మధుబాబు నాయుడు, షేక్ మస్తాన్, సుకుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌కు సహకరిస్తున్న వైద్యులకు సత్కారం


వైద్యులను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కావలి రెడ్‌క్రాస్ తలసేమియా కేర్ సెంటర్ బాధిత చిన్నారులకు పట్టణంలోని ప్రముఖ వైద్యులు స్వచ్ఛందంగా, ఉచితంగా సేవలు అందిస్తున్నారని కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు బెజవాడ రవికుమార్ తెలిపారు. రెడ్‌క్రాస్ డేకేర్ సెంటర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ అల్లం శ్రీనివాసులు, డాక్టర్ పీ. శివప్రసాద్, డాక్టర్ వీ గోపీలను సత్కరించారు. రక్తమార్పిడి చేయించుకున్న చిన్నారులకు పౌష్టికాహారం, మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు డీ.రవిప్రకాష్, కే.హరినారప రెడ్డి, బీఎస్ ప్రసాద్, బార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

కావలి ఏఎంసీ కార్యవర్గ తొలి సమావేశం

కావలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గ తొలి సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య అధ్యక్షతన ఏఎంసీ కార్యాలయంలో జరిగింది. ముందుగా నూతన పాలకవర్గంకు సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కావలి రైతుబజారు అభివృద్ధికి రూ.55 లక్షలు, మార్కెట్ కమిటీ కార్యాలయం, గోదాముల నిర్వహణకు రూ.96 లక్షలు, గ్రామాలలో రైతుల పొలాల్లోకి గ్రావెల్ రోడ్లు వేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వాటిని తీర్మానించారు. మద్దూరుపాడు మార్కెట్ యార్డు ఆవరణలో భూసార పరీక్ష కేంద్రం, నీటి పరీక్ష కేంద్రం, పశువుల వైద్యపరీక్షలకు అవసరమైన బోనులు ఏర్పాటు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 262 మంది ఎంపిక

కావలి(టౌన్), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 262మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఈ మేళాలో 16 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు ఆయా కంపెనీలకు చెందిన ప్రతినిధులు నియామక పత్రాలను ఎమ్మెస్సార్ కరస్పాండెంట్ రాజ్‌కుమార్ చౌదరి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూమ్‌ల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడీఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా

కావలిరూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు టోల్‌ప్లాజా వద్ద మంగళవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో మద్యం సేవించి బైకులు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ రాజేశ్వరరావు తెలిపారు. వారిని పట్టణంలోని ప్రిన్సిపల్ సివిల్ కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10,000 జరిమానా విధించినట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


గుడ్లూరు:కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

గుడ్లూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పూరేటిపల్లి (సీతారామపురం)లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రైతన్న - మీ కోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ముందుగా రైతుల సంక్షేమం గురించి ఎక్కువగా ఆలోచిస్తుంటారన్నారు. గత వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీల నిధులు దారిమళ్లించడంతో గ్రామీణాభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందన్నారు. పూరేటిపల్లిలో అంటు వ్యాధులు రాకుండా పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరకొండపాడుకు రోడ్డును త్వరలో పూర్తిచేయిస్తానని హామీ ఇచ్చారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా పైపులైన్ మరమ్మతుపనులు పూర్తిచేసి, ఇంటింటికి కుళాయి నీటిని అందిస్తామని తెలిపారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గ్రామానికి వాటర్ ప్లాంట్ మంజూరు చేసి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎల్. శ్రీనివాసులురెడ్డి, ఏవో రవికుమార్, ఏపీఎం చినబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, చిత్తారి మల్లికార్జున, ఉన్నం వెంటకటేశ్వర్లు, జనసేన మండల అధ్యక్షుడు సనిశెట్టి గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

● కావలి రూరల్ : రైతును రాజును చెయ్యాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆముదాలదిన్నెలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రైతుల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపే పంచసూత్రాల కరపత్రాలను వ్యవసాయ శాఖ ఏడీ నాగరాజు, ఏవో లలిత, రైతుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీడీవో శ్రీదేవి, ఏవో లలిత, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావ్, ఉప్పాల దినేష్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● కొండాపురం : కొండాపురంలో మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి టీడీపీ మండల కన్వీనర్ పోలినేని చంద్రబాబునాయుడు రైతన్నా-మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం రైతులకు అందచేస్తున్న పథకాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే ఆదిమూర్తిపురంలో సాగునీటి సంఘ అధ్యక్షుడు జాగర్ల మూడి శ్రీనివాసులు, తూర్పుఎర్రబల్లిలో టీడీపీ యువనాయకుడు బాలక్రిష్ణల ఆధ్వర్యంలో రైతన్నా-మీకోసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పోలినేని రమేష్, మండల తెలుగు యువత అధ్యక్షుడు దాసరి అశోక్, సర్పంచు మాచర్ల, నాయకులు నర్రా శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● కలిగిరి : మండలంలోని జిర్రావారిపాలెంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి పాల్గొని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎస్కే జహీర్, ఏఈవో చిరంజీవి, నాయకులు జిర్రా పెద్దఅంకిరెడ్డి, జిర్రా మూడవ అంకిరెడ్డి, కొప్పోలు కొండలరావు, బత్తల రాజయ్య, వీపీఏ నిఖిత, ఏహెచ్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి : మండలంలోని కుర్రపల్లి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల సాగులో సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యం, విత్తనశుద్ధి, పంట మార్పిడి, ప్రకృతి వ్యవసాయం తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటా తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా గురించి ఆందోళన వద్దు

అల్లూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో వరిసాగు చేసే రైతులు యూరియా కోసం ఆందోళన చెందవలసిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ యూరియా కొరత ఏర్పడుతుందని ఇటీవల ఒక అపోహ రైతులను ఆందోళనకు గురిచేస్తుందన్నారు. యూరియా గురించి రైతులు పూర్తిగా అపోహలు వీడి వ్యవసాయ పనులను నిశ్చింతగా చేసుకోవాలన్నారు. సాగుకు సరిపడా యూరియా అందుబాటులలో ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఏ రైతుకైనా యూరియా పంపిణీ కార్డులు ఇవ్వడంతోపాటు అవసరమైనంత మేరకు ఎకరానికి 3 బస్తాల యూరియా ఇస్తామన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

(5వ పేజీ తరువాయి)

కనెక్టివిటీ కలిగి పర్యాటకులు ఆకర్షితులవుతారని తెలిపారు.

● మన చారిత్రాత్మక వారసత్వ సంపద వృద్ధిలో భాగంగా ఉదయగిరి హిల్ ఫోర్ట్, నరసింహ స్వామి దేవాలయ అభివృద్ధి కోసం రూ.36.50 కోట్లు, ఉదయగిరిలోని రంగనాయకుల దేవాలయం అభివృద్ధికి రూ.13.25 కోట్లు, శ్రీకృష్ణదేవాలయ అభివృద్ధికి రూ.2.45కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు చెప్పారు. బుచ్చిరెడ్డిపాలెం వద్ద కురుగుండ కనిగిరి రిజర్వాయర్ పర్యాటక కేంద్రం అభివృద్ధికి రూ.22.32 కోట్లు, పెంచలకోనలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధి కోసం రూ.20.62 కోట్లతో పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు చెప్పారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ద్వారా కేంద్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలో టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధి పనులు మొదలు పెట్టేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి లక్ష్మీనరసింహరావు, జిల్లా అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ సభ్యుడు పెనుబల్లి కృష్ణచైతన్య, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఇందుకూరుపేట తహసీల్దారు మురళీ, తదితరులు పాల్గొన్నారు.

ముందరపొట్టెమ్మకు వైసీపీ నేతల పూజలు

కావలి రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆరోగ్యం కుదుట పడాలని మండల వైసీపీ నాయకులు మంగళవారం ముందరపొట్టెమ్మ, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ ఆలూరు కొండమ్మ, జడ్పీటీసీ జంపాని రాఘవులు, ఏఎంసీ మాజీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌ల ఆధ్వర్యంలో 101 టెంకాయలు కొట్టారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

● బిట్రగుంట : బోగోలులోని విజయగణపతి ఆలయంలో వైసీపీ మండల కన్వీనర్ ఎం.వీరరఘు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు ప్రత్యేక పూజలు జరిపించారు. కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాఎకుమార్‌రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా తిరిగి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కీర్తన, ఎంపీటీసీలు మద్దిబోయిన పద్మ, ఏకే సుందర్‌రాజ్, మాజీ ఎంపీపీ పీ.సులోచనమ్మ, నేతలు రమణయ్య మాచర్ల, సాల్మన్‌రాజ్, కళ్యాణ్‌కుమార్, సాగర్, నాయిబ్‌రసూల్, వరుణ్, సుధాకర్, జీ.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ

వలేటివారిపాలెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళవళ్ల గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీవో శంకర్‌రావు తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్‌రావు మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నారాయణ పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

కావలి రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో మంగళవారం హెల్మెట్ వినియోగంపై ఆర్టీవో మురళీధర్ అవగాహన కల్పించారు. పాఠశాలల బస్‌లు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సుందర్‌రావు, అసిస్టెంట్ ఎంవీఐలు కరుణాకర్, లక్ష్మీభాయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ నేత సుందరయ్య సస్పెన్షన్‌పై నిరసన

కావలి(టౌన్), నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా మంగళవారం డిపో వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏలూరు ప్రజా రవాణాధికారి కార్యాలయం ఆడిట్ సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుందరయ్యకు ఏలూరు డిపో పెట్రోల్ పాయింట్‌లో జరిగిన అవినీతిలో ఎటువంటి సంబంధం లేకపోయినప్పటికీ ఆయనను అక్రమంగా సస్పెండ్ చేయడం కేవలం కక్ష పూరిత చర్యేనన్నారు. సుందరయ్యతో పాటు మరో ముగ్గురు ఉద్యోగులను బాధ్యులు చేస్తూ సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. వారిపై సస్పెన్షన్ ఎత్తివేసి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అనంతరం డీఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో అధ్యక్షుడు వీవీ రెడ్డి, నాయకులు షేక్ కాలేషా, అల్లాబాషా, మురళి, మస్తాన్‌బాషా, మోహనరావు, మునీర్, ఖాజామొహిద్దీన్, మాతయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

కందుకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): లింగసముద్రం మండలం పెంట్రాలకు చెందిన పలు కుటుంబాల వారు వైసీపీని వీడి మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన మన్నేపల్లి రమేష్, సురేష్, మేలింగి తిరుపాలు, తాళ్లూరి మాలకొండయ్య, మన్నేపల్లి నాగేశ్వరరావు, మన్నేపల్లి ప్రసంగి, ఇంద్రకంటి రమేష్, నూకతోటి అలరాజు, జనంగుల ఆంజనేయులు, మన్నేపల్లి ధనుష్, మన్నేపల్లి లక్ష్మీనరసయ్య తదితరులకు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

పొగాకు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

వలేటివారిపాలెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : పొగాకు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని కందుకూరు పొగాకు బోర్డు రెండవ వేలం కేంద్రం నిర్వాహణాధికారి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని అయ్యవారిపల్లెలో మంగళవారం పొగాకు సాగు యాజమాన్య శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ రాజ్‌గోపాల్, ఐటీసీ మేనేజరు గోలి వెంకటేష్, జీపీఐ మేనేజరు ఉన్నం శ్రీనివాస్, క్షేత్ర సాంకేతిక సహాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌ఆర్‌లో అమృత యూనివర్సిటీ వర్చువల్ వర్క్‌షాప్

కందుకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కోయంబత్తూర్‌లోని అమృత విశ్వవిద్యాపీఠం సౌజన్యంతో మంగళవారం వర్చువల్ లేబరేటరీ ప్రయోగాల వర్క్‌షాప్ నిర్వహించారు. అమృత విశ్వవిద్యాపీఠం ప్రొఫెషర్ పీఎఫ్ సనీష్, రీసెర్చ్ అసోసియేట్ ఎన్.నిజిన్‌ల ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహించగా టీఆర్‌ఆర్ కళాశాల భౌతిక, రసాయన, జంతు, వృక్షశాస్త్ర విద్యార్థినీ విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ప్రాక్టికల్స్‌ను సులువైన పద్ధతిలో నేర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయాలి

అల్లూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 30న నియోజకవర్గస్థాయిలో కావలిలో నిర్వహించే ఆటల పోటీలకు విద్యార్థులను యాజమాన్యాలు సిద్ధం చేయాలని ప్రైవేటు పాఠశాలల స్టేట్ సీనియర్ ఉపాధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని నార్తు ఆములూరు గొల్లపాలెం ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ప్రైవేటు పాఠ శాలల కరెస్పాండెంట్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నేలనూతల శ్రీధర్, మనోహర్ రెడ్డి, శ్రీనివాసరావు, గోపాల్ రెడ్డి, రాధాకృష్ణ, మజహర్ పాల్గొన్నారు.


వినియోగదారుల సమస్యలపై పోరాటం

దగదర్తి(బిట్రగుంట) నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు తమ సమస్యలను తెలియచేస్తే పరిష్కారానికి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని ఏపీ సీహెచ్‌ఆర్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చీదర్ల మల్లికార్జున అన్నారు. దగదర్తి మండలం సున్నపుబట్టి సెంటర్లో ఫోరం లీడర్స్ మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా హనుమారెడ్డి, రాష్ట్ర మహిళా లీడర్ బెల్లంకొండ మమూల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, గోపి, సురేష్, పాసేటి నాగరాజు, సయ్యద్ అక్బర్, రమాదేవి, రాగయ్య, పాల్గొన్నారు. అనంతరం కోవూరుపల్లి పీహెచ్‌సీని సందర్శించారు.

ప్రీ క్రిస్మస్ వేడుకలు

అల్లూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ నెలారంభం కావడంతో అల్లూరు పట్టణ పరిధిలోని యేసు అభిషేక మినిస్ట్రీస్ చర్చిలో మంగళవారం రాత్రి ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చర్చి వ్యవస్థాపకుడు దేవరకొండ శ్యామియేలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక క్రైస్తవులు పాల్గొన్నారు.

పంచమి వేళ.. పద్మజన సరోవరం



● జనసంద్రమైన తిరుచానూరు ● పటిష్ఠ భద్రతా చర్యలతో ప్రశాంతంగా పంచమితీర్థం ● ధ్వజావరోహణంతో ముగిసిన పద్మావతీదేవి బ్రహ్మోత్సవాలు

కార్తిక మాసం శుక్లపక్ష పంచమి తిథి.. తిరుచానూరులోని పద్మసరోవరంలో అమ్మవారు ఆవిర్భవించిన రోజు. ఏటా పద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాల్లో ఇదే తిథిన నిర్వహించే పంచమితీర్థంలో పుష్కరిణి స్నానమాచరిస్తే కోటిజన్మల పుణ్యఫలం చేకూరుతుందన్నది భక్తుల నమ్మకం. అందుకే మంగళవారం జరిగిన పంచమితీర్థానికి భక్తులు పోటెత్తారు. తమిళనాడు నుంచీ అధిక సంఖ్యలో భక్తులు రావడంతో తిరుచానూరు జనసంద్రమైంది. లక్ష మందికిపైగా పుష్కరిణి స్నానం చేసినట్లు అంచనా. ఇంత రద్దీకి తగ్గట్టు పటిష్ఠ ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపట్టడంతో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నిత్యకైంకర్యాల అనంతరం పల్లకి ఉత్సవం నిర్వహించారు. 8 గంటలకు సన్నిధి ముఖమండపంలో అమ్మవారికి చూర్ణాభిషేకం, ఆస్థానం జరిపారు. 9 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని, చక్రత్తాళ్వారును వేంచేపుగా పద్మసరోవరం పంచమితీర్థం మండపానికి వేంచేపు చేశారు. 10.56గంటలకు తిరుమల నుంచి శ్రీవారు పంపిన సారె ఆ మండపానికి చేరుకుంది. ఆ సారెతో అమ్మవారు, చక్రత్తాళ్వార్లకు జియ్యంగార్ల సమక్షంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. పుట్టిన రోజు కానుకగా అమ్మవారికి శ్రీవారు పంపిన ఆభరణాలతో, దివ్య సుగంధ తులసిమాలలతో అలంకరించారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అభిజిత్-కుంభలగ్నంలో పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా చక్రత్తాళ్వార్‌ను పుష్కరిణిలో అర్చకులు మూడుసార్లు మునక వేయించారు. అప్పటికే పుష్కరిణిలో వేచిఉన్న భక్తులు 'శ్రీ పద్మావతీ పాహిమాం, గోవింద' అంటూ స్నానాలాచరించారు. రాత్రి వరకు లక్ష మందికిపైగా పుష్కరిణి స్నానాలు చేసినట్లు టీటీడీ అంచనా. పుష్కరిణిలో స్నానాల కోసం సోమవారం అర్ధరాత్రికే హోల్డింగ్ పాయింట్లు భక్తులతో నిండిపోయాయి. వారికి మంగళవారం ఉదయం అల్పాహారం, పాలు అందించారు. 10గంటల నుంచి ప్రత్యేక క్యూలైన్ల ద్వారా పుష్కరిణిలోకి అనుమతించారు. మూలమూర్తి దర్శనానికీ భక్తులు పోటెత్తారు. మంగళవారమంతా బంగారు చీరలో స్వర్ణశోభితంగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 10 గంటలకు ధ్వజావరోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.


- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

గూడూరు.. తిరుపతిలోనే!

యథాతథంగా నగరి

వెంకటగిరి పూర్తిగా జిల్లాలోకే

34 నుంచి 37కు పెరగనున్న మండలాలు



తిరుపతి, ఆంధ్రజ్యోతి

జిల్లాలు, డివిజన్ల పునర్విభజనపై మంత్రుల కమిటీ సిఫారసులపై సీఎం చంద్రబాబు తుది నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో స్వల్ప మార్పులు మినహా జిల్లా యథాతథంగా కొనసాగనుంది. వెంకటగిరి నియోజకవర్గంలోని మూడు మండలాల విలీనంతో పూర్తిగా జిల్లాలో చేరనుంది. దీంతో ప్రస్తుతం 34గా ఉన్న మండలాల సంఖ్య 37కు చేరనుంది. తద్వారా రాష్ట్రంలోని అతిపెద్ద జిల్లాల్లో ఒకటిగా తిరుపతి ఆవిర్భవించనుంది.

● గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తామని గతంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చినప్పటికీ అనివార్య కారణాలతో ఆ ప్రతిపాదనకు ఆమోదం లభించలేదు. దీంతో గూడూరు తిరుపతిలోనే కొనసాగనుంది. క్రిస్ సిటీ, శ్రీసిటీ, సాగరమాల రోడ్ ప్రాజెక్టులు వంటివి ఒకే జిల్లాలో ఉంటే అభివృద్ధికి అవకాశముంటుందని ప్రభుత్వం భావించడం వల్లే ఈ నిర్ణయానికి కారణమైందని తెలిసింది.

● నగరి నియోజకవర్గానికి సంబంధించి చిత్తూరు జిల్లాలో ఉన్న నగరి, విజయపురం, నిండ్ర మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేసే ప్రతిపాదనపై కసరత్తు నడిచింది. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కూడా తిరుపతిలో కలపాలని ప్రభుత్వాన్ని కోరారు. చిత్తూరు జిల్లా నుంచి పుంగనూరు నియోజకవర్గాన్ని మదనపల్లె జిల్లాలో కలుపుతున్నారు. దీతో ఈ మూడు మండలాలనూ తిరుపతిలో కలిపితే ఆ జిల్లాలో మండలాల సంఖ్య, జనాభా తగ్గిపోయే అవకాశముంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆ మూడు మండలాల విలీన ప్రతిపాదనను పక్కన పెట్టినట్టు సమాచారం.

● వెంకటగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రాపూరు, కలువాయి, సైదాపురం నెల్లూరు జిల్లాలోనూ, వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి తిరుపతి జిల్లాలోనూ ఉన్నాయి. మంత్రుల కమిటీ చేసిన సిఫారసుల మేరకు రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేసేందుకు సీఎం చంద్రబాబు ఆమోదముద్ర వేశారు.

● నెల్లూరు జిల్లా నుంచి చేరనున్న రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను గూడూరు రెవెన్యూ డివిజన్‌లో కలిపేందుకు సీఎం అంగీకరించారు. ఫలితంగా ఇప్పటి దాకా ఎనిమిది మండలాలతో కూడిన గూడూరు రెవిన్యూ డివిజన్ ఇకపై 11 మండలాలకు విస్తరించనుంది.

ప్రాజెక్టులకు గేట్లెత్తారు



'అరణియార్'లో రెండు..


పిచ్చాటూరులోని అరణియార్ రిజర్వాయర్ రిజర్వాయరు నుంచి మూడోసారి రెండు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. రిజర్వాయర్‌లో మంగళవారం ఉదయానికి నీటిమట్టం 30.6 అడుగులకు చేరింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి 300 క్యూసెక్కుల నీరు చేరుతోంది. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు కురిస్తే మరింత ఎక్కువ నీటిని విడుదల చేసే అవకాశం ఉందని జలవనరుల శాఖ డీఈ శ్రీనివాసులు తెలిపారు.

- పిచ్చాటూరు, ఆంధ్రజ్యోతి

'మల్లిమడుగు'లో 4 గేట్లు..

రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలోని మల్లిమడుగు డ్యాం నిండడంతో 4 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. తిరుమలలోని డ్యాములు నిండడంతో మంగళవారం నీటిని కిందకు విడుదల చేశారు. దీంతో మల్లిమడుగు డ్యాంలోకి నీటి ప్రవాహం పెరగడంతో ఉదయం నుంచి 4 గేట్లను అర అంగుళం పైకి ఎత్తి వదిలారు. రెండు రోజులుగా అడపాదడపా వర్షం పడుతుండంతో మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉందని డ్యాం డీఈ చంద్రమౌళి తెలిపారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి



రాజ్యాంగ పుస్తక ఆకృతిలో విద్యార్థులు

వెదురుకుప్పం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినూత్న ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వేడుకలకు ముందస్తుగా మంగళవారం రాజ్యాంగ దినోత్సవం పుస్తకం ఆకారంలో విద్యార్థులు కూర్చొన్నారు. రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



భూసేకరణ, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



తిరుపతి(కలెక్టరేట్), నవంబర్ 25(ఆంధ్రజ్యోతి): వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, జాతీయ రహదారులు, క్రిష్ సిటీ, ఏపీఐఐసీకి సంబంధించి దుగ్గరాజుపట్టణం పనులు, శ్రీసిటీలోని ఎల్జీ కంపెనీకి సంబంధించి పలు భూసంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోపు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయ్‌భరత్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాటిగేగులు వచ్చేశాయ్!



పండగ నెలలో సందడిచేసే గేగులు అప్పుడే కనిపిస్తున్నాయి. బజార్లలో బుట్టల్లో పెట్టుకుని అమ్ముతున్నారు. తాటిముట్టి మొలకెత్తడానికి ముందు దశే ఇది. తేగలనీ, గేగులనీ పిలుస్తారు. దీన్ని రెండు పాయలుగా చీలిస్తే మధ్యలో ఉండే దబ్బలాంటి తెల్లటిదాన్ని చందమామ అంటారు. దీని కొన మెత్తగా రుచిగా ఉంటుంది. గేగు తొక్క తీసేసి తింటే మొత్తం పిండిపదార్థమే. పీచు ఎక్కువగా ఉండే ఆహారం కావడం వల్ల జీర్ణక్రియకు బాగా దోహదపడుతుంది. తాటి చెట్ల నుంచి రాలిన పండ్లు చీకిపోయి ముట్టెలు తేలుతాయి. వీటిని ఏరి మెత్తని మట్టిలో కప్పిపెడితే మూడు నెలలకు తేగలు తయారవుతాయి. వీటిని తవ్వితీసి కాల్చుకునిగానీ ఉడకబెట్టుకుని గానీ తింటారు. సహజసిద్ధమైన ప్రకృతి ఆహారం ఇది. ఇప్పటికీ ప్రభుత్వ బడుల ముందు ఈ సీజన్‌లో అమ్ముతూ ఉంటారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

10న స్థానికులకు వైకుంఠద్వార దర్శనాల టోకెన్ల విడుదల

తిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శనాలు జరిగే చివరి మూడురోజులు స్థానికులకు దర్శన అవకాశం కల్పించనున్నారు. జనవరి 6, 7, 8 తేదీలకు సంబంధించిన టోకెన్లను డిసెంబరు 10వ తేదీ ఉదయం 10 గంటలకు వన్ ప్లస్ త్రీ విధానంలో కేటాయించనున్నారు. తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట స్థానికులకు రూ.4,500, తిరుమల స్థానికులకు 500 చొప్పున రోజుకు 5 వేల టోకెన్లు జారీ చేయనున్నారు. దీని కోసం కూడా ప్రత్యేక యాప్‌ను రూపొందించనున్నారు. ఇక, టీటీడీ ఉద్యోగులకు కూడా దర్శన విధివిధానాలను రూపొందించారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని ఓ షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.23 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,615

తలనీలాలు సమర్పించినవారు: 27,722







మాడవీధుల్లో భక్తజనం - హోల్డింగ్ పాయింట్ నుంచి క్యూలలో పుష్కరిణిలోకి..

తిరుచానూరు దిగ్బంధం

● వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల ఘటనతో అధికారుల అప్రమత్తం ● పంచమి తీర్థానికి పటిష్ట చర్యలు

తిరుచానూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ ప్రక్రియలో తిరుపతి నగరం బైరాగిపట్టెడ వద్ద తొక్కిసలాట నేపథ్యంలో అధికారులు పంచమితీర్థానికి అప్రమత్తమయ్యారు. పోలీసు, టీటీడీ ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేశారు. జిల్లా అధికారులే ఒకటికి నాలుగుసార్లు అమ్మవారి పుష్కరిణి, ఆలయ మాడవీధులు, పార్కింగ్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పర్యటించారు. తిరుచానూరు గ్రామాన్ని అష్టదిగ్బంధం చేశారు సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు తిరుచానూరులోకి వాహనాలను అనుమతించకుండా గ్రామ ముఖద్వారాల పోలీసు పికెట్లు ఏర్పాటుచేశారు. గ్రామంలోకి ప్రవేశించిన ప్రతి భక్తుడిని సోమవారం రాత్రి నుంచే హోల్డింగ్ పాయింట్లకు పంపారు. మంగళవారం ఉదయం 11గంటల వరకూ వచ్చిన ప్రతి ఒక్కరినీ షెడ్లకు పంపి.. విడతల వారీగా ప్రత్యేక క్యూలైన్ల ద్వారా పుష్కరిణిలోకి అనుమతించారు. టీటీడీ ఉద్యోగులు, ఇతర శాఖ ఉద్యోగులు ఎక్కడికక్కడ మీడియాను కూడా నిరోధించి 10గంటల తర్వాత పుష్కరిణిలోకి పంపారు. ఇలా ఎక్కడికక్కడ పటిష్ట చర్యలు తీసుకోవడంతో తొక్కిసలాట లేకుండా పుష్కరిణిలో భక్తులు స్నానాలాచరించారు. చిన్న చిన్న తోపులాటలు మినహాయించి ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా పంచమితీర్థం ముగిసింది. దీంతో వేలాది మంది భక్తులు తరలివచ్చినా ప్రశాంత వాతావరణంలో పుణ్యస్నానాలు ఆచరించి తిరుగు పయనమయ్యారు. ఇక, సుపథం మహాద్వారం వద్ద పెద్దసంఖ్యలో భక్తులు గుమికూడటంతో తోపులాట జరిగింది. భక్తులు కాస్త ఇబ్బందిపడ్డారు. పద్మావతి అమ్మవారి దర్శనానికి రాత్రి పొద్దుపోయే వరకూ భక్తులు బారులు తీరారు. వేలాది మంది తరలి వచ్చి పద్మసరోవరలో పుష్కర స్నానాలుచేశారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ కలిసి జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులను అభినందించారు.



పుష్కరిణిలో భక్తులకు రక్షణగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది



అన్ని దారులు పుష్కరిణి వైపే..

పద్మపుష్కరిణిలో స్నానమాచరించడానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. రాత్రి వరకూ దాదాపు లక్షమందికిపైగా భక్తులు తిరుచానూరుకు తరలిరావడంతో ఎటుచూసినా భక్తుల రద్దీనే కనిపించింది.

ఉదయం: అమ్మవారికి శ్రీవారి సారె



తిరుచానూరు వద్ద సారె ఊరేగింపు..

పంచమితీర్థం రోజున తిరుచానూరు పద్మావతిదేవికి శ్రీవారి ఆలయం నుంచి సారె సమర్పించారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పరిమళాన్ని విమాన ప్రాకారంలో తెల్లవారు జామున ఊరేగించారు. గర్భాలయంలో శ్రీవారి వక్షఃస్థల లక్ష్మీ అమ్మవారికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహించారు. 4.30 గంటలకు శ్రీవారి ఆలయం నుంచి సారె ఊరేగింపు మొదలైంది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఏకాంగులు, అర్చక పరిచారకులు కాలిబాటన అలిపిరికి చేరుకున్నారు. అక్కడ జేఈవో వీరబ్రహ్మంకు అందజేశారు. అక్కడి నుంచి సారె తీసుకుని భారీ ఏనుగు అంబారీ మధ్య కోమలమ్మ సత్రం, కోదండరామాలయం, గోవిందరాజస్వామి ఆలయం, ఆర్టీసీ బస్టాండ్, లక్ష్మీపురం మీదుగా తిరుచానూరు ముఖద్వారం వద్దనున్న పసుపు మండపానికి 10.15 గంటలకు తీసుకొచ్చారు. సారెకు ప్రత్యేక పూజలు చేశాక టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, సీవీఎస్వో మురళీకృష్ణ, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు తిరువీధుల్లో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి.. 10.56 గంటలకు పంచమితీర్థం మండపానికి తీసుకొచ్చారు.

- తిరుమల/తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



శ్రీవారి ఆలయంలో

సాయంత్రం: బంగారు పద్మంపై పద్మావతి

చక్రస్నానం అనంతరం అమ్మవారిని పుష్కరిణికి ఎదురుగా ఉన్న గంగుండ్ర మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం శ్రీవారు పంపిన బంగారు ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు. సాయంత్రం 7.30 గంటలకు అమ్మవారు బంగారు పద్మంపై ఆశీనులై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు.





నేడు: పుష్పయాగం

పద్మావతి అమ్మవారి ఆలయంలో బుధవారం సాయంత్రం ఐదు గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నారు. ఏటా బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు టిక్కెట్లు కొనుగోలు చేసి పుష్పయాగంలో పాల్గొనవచ్చు. ఈ సందర్భంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దుచేశారు.

రాత్రి: ధ్వజావరోహణం

మంగళవారం రాత్రి 10- 11 గంటల మధ్య ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద అర్చకులు ప్రత్యేక పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా అర్చకులు ధ్వజారోహణం రోజున ఎగురవేసిన గజపటాన్ని అవరోహణం చేశారు. ఉత్సవాల నిర్వహణకు ఆహ్వానించిన సకల దేవతలను, అష్టదిక్పాలకులకు బలినివేదన చేసి తిరిగి వారిని యథాస్థానానికి పంపించారు. ఉత్సవాల నిర్వహణలో పాలుపంచుకున్న పాంచరాత్ర ఆగమ పండితులు, అర్చకులను ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించి ఆలయ మర్యాదలతో ఇంటికి తీసుకెళ్లి వదిలిపెట్టారు. దీంతో ఈ నెల 17న ప్రారంభమై.. తొమ్మిది రోజులు వైభవంగా జరిగిన బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆయా కార్యక్రమాల్లో జీయర్ స్వాములు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, కలెక్టర్ వెంకటేశ్వర్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పాలకమండలి సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సదాశివరావు, నరేష్‌కుమార్, శాంతారామ్, జానకిదేవి, రంగశ్రీ, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

సత్యవేడు రెవెన్యూ డివిజన్ హామీని నెరవేర్చండి సార్

● సీఎంకు ఎమ్మెల్యే ఆదిమూలం విజ్ఞప్తి

సత్యవేడు/పిచ్చాటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సత్యవేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు హామీని నెరవేర్చాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... 2024 ఏప్రిల్ 20న ఎన్నికల బహిరంగ సభలో సత్యవేడును రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తానని సత్యవేడు టవర్‌క్లాక్ సాక్షిగా సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం 2024 ఆగస్టు 19న శ్రీసిటీ పర్యటనకు విచ్చేసిన సమయంలో సత్యవేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని సీఎంకు తాను వినతిపత్రం సమర్పించానని చెప్పారు. గత నెల కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సత్యవేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ వినతి అందించానన్నారు. సత్యవేడు నియోజకవర్గం తమిళనాడు రాష్ట్ర సరిహద్దుగా ఉండడంతో పాటు దేశానికి తలమానికంగా ఉన్న శ్రీసిటీలో సుమారు 300 బహుళ జాతి కంపెనీలు, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించిన హీరో, అపోలో, కాప్రికాన్ వంటి బడా కంపెనీలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో ఈ ప్రాంతంలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, వీటన్నింటికి పరిష్కారం చూపాలంటే సత్యవేడు రెవెన్యూ డివిజన్ తప్పనిసరి అని ఎమ్మెల్యే వివరించారు. తన సత్యవేడు రెవెన్యూ డివిజన్ విజ్ఞప్తిని సీఎం పరిశీలించాలని కోరారు.

స్విమ్స్‌లో హైడిఫినిషన్ టీడీసీఎస్ చికిత్సలు

తిరుపతి(వైద్యం), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లోని మానసిక విభాగం ఆధ్వర్యంలో హైడిఫినిషన్ టీడీసీఎస్ ద్వారా అత్యాధునిక వైద్య చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడం గొప్ప విషయమని డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. మానసిక విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించిన హైడిఫినిషన్ టీడీసీఎస్ చికిత్సలను ఆయన పరిశీలించారు. మెదడు నాడీకణాలపై తక్కువ మోతాదులో విద్యుత్తు ప్రవాహాన్ని అత్యంత ఖచ్చితమైన మానిటరింగ్‌తో అందించే నాన్-ఇన్‌వేసివ్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ టెక్నిక్‌గా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన అత్యాధునిక వైద్య పద్ధతులను రాష్ట్రంలోనే మొదటిసారిగా స్విమ్స్ మానసిక విభాగంలో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇది మానసిక సమస్యలతో బాధపడేవారికి, మానసిక రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. న్యూరాలజీ, ఫిజియోథెరపీ రంగాల్లో కూడా ఈ చికిత్సలు రోగులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ డాక్టర్ రామ్, మానసిక విభాగాధిపతి డాక్టర్ గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు హైడిఫినిషన్ చికిత్సలు నిర్వహిస్తున్న డాక్టర్ గణేష్‌కుమార్

వేగంగా పాపవినాశనం రోడ్డు విస్తరణ పనులు





వేణుగోపాల స్వామి ఆలయం వద్ద సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

● తొలిదశలో ఆకాశగంగ వరకు నాలుగులైన్ల రోడ్డు

తిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమలలో పాపవినాశనం రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఔటర్‌రింగు రోడ్డు నుంచి ఆకాశగంగ వరకు నాలుగులైన్ల రోడ్డు నిర్మిస్తున్నారు. టీటీడీ రూ.40 కోట్ల బడ్జెట్‌తో ఔటర్‌రింగు రోడ్డు నుంచి నేపాలి చెక్‌పోస్టు మీదుగా పాపవినాశనం దాకా ఈ పనులు చేపట్టింది. తిరుమలకు వచ్చే భక్తుల్లో సగానికిపైగా పాపవినాశనం, జపాలి ఆంజనేయస్వామి, ఆకాశగంగ, వేణుగోపాల స్వామి ఆలయాలను సందర్శిస్తుంటారు. రెండు వరుసల రోడ్డు మాత్రమే ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు తరచూ తలెత్తుతున్నాయి.

తొలి దశలో : రింగురోడ్డు నుంచి ఆకాశగంగ వరకు నాలుగులైన్ల రోడ్డు నిర్మాణంతో పాటు వాహనాలు గోగర్భం డ్యాం మీదుగా వెళ్లే అవసరం లేకుండా ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి క్షేత్రపాలకుని ఆలయం మీదుగా మఠాలు, డిపింగ్‌యార్డు, నేపాలి చెక్‌పోస్టుకు చేరుకునేలా రోడ్డు నిర్మాణం పనులు మొదలుపెట్టారు. పాచికాల్వ బ్రిడ్జి పనులు దాదాపు చివరి దశలో ఉన్నాయి. మఠాల నుంచి నేపాలి చెక్‌పోస్ట్ వరకు నాలుగులైన్ల సీసీ రోడ్డు నిర్మాణం కూడా పూర్తయింది. ప్రస్తుతం నేపాలి చెక్‌పోస్టు నుంచి ఆకాశగంగ వరకు రోడ్డు నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. వేణుగోపాల స్వామి ఆలయం నుంచి ఆకాశగంగ వరకు అదనంగా రెండు లైన్ల నిర్మాణం కోసం దట్టమైన అడవిలో పనులు సాగుతున్నాయి. డిసెంబరు 31 నాటికి పనులు పూర్తిచేయాలని టీటీడీ ఇంజినీరింగ్ విభాగం ప్రణాళికలు రూపొందించుకుంది. ఇక, ఆకాశగంగ నుంచి పాపవినాశనం వరకు ఉన్న రోడ్డు మార్గం ప్రభుత్వ ఫారెస్ట్ పరిధిలో ఉండటంతో నిర్మాణం కోసం ప్రభుత్వానికి టీటీడీ ఇప్పటికే లేఖ రాసింది. అనుమతులు లభించిన వెంటనే రెండవ దశలో ఈ రోడ్డు విస్తరణ పనులు కూడా మొదలుకానున్నాయి.

దక్కిలి 'విండో'కు పర్సన్ ఇంఛార్జి కమిటీ

తిరుపతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గం దక్కిలి సింగిల్‌విండోకు ప్రభుత్వం పర్సన్ ఇంఛార్జి కమిటీని నియమించింది. ఇప్పటి వరకూ అఫిషియల్ పర్సన్ ఇంచార్జి కమిటీ కొనసాగుతుండగా ప్రభుత్వం దాని స్థానంలో అనధికార పర్సన్ ఇంఛార్జి కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ చైర్మన్‌గా వెలికంటి రమణారెడ్డి, సభ్యులుగా పిల్లి కృష్ణారెడ్డి, మెరిగ వెంకటస్వామిలను నియమించింది. కొత్తగా నియమించిన కమిటీ కాలపరిమితి వచ్చే ఏడాది జనవరి 30 దాకా వుంటుంది. ఆపై గడువు పొడిగించే అవకాశముంది. ఈ మేరకు రాష్ట్ర సహకార శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీకాళహస్తి టౌన్‌బ్యాంకు పాలకవర్గం గడువు పొడిగింపు

శ్రీకాళహస్తి సహకార టౌన్ బ్యాంకు పర్సన్ ఇంఛార్జి కమిటీ కాలపరిమితిని మ రో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత కమిటీ కాలపరిమితి ఈనెల 28వ తేదీ నాటికి ముగిసిపోనుంది.దీంతో ఈనెల29వ తేదీ నుంచీ వచ్చే ఏడాది మే నెల 28వ తేదీ వరకూ కమిటీ కాలపరిమితిని పొడిగించింది.

హింసకు వ్యతిరేకంగా పోరాడేందుకు ముందడుగు వేద్దాం..!

● మహిళల రక్షణకు 100, 181, 1901 హెల్ప్‌లైన్లు

తిరుపతి (రూరల్/విశ్వవిద్యాలయాలు), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, రక్షణకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపడుతున్నాయని, తమకున్న హక్కులపై అవగాహన పెంచుకోవాలని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ అధ్యాపకురాలు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నీరజ, డాక్టర్ పద్మావతి పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ డే ఫర్ ద ఎలిమినేషన్ ఆఫ్ వైలెన్స్ అగైనెస్ట్ ఉమెన్‌ని పురస్కరించుకుని జెండర్ సమానత్వంకోసం వర్సిటీ ఉమెన్‌స్టడీస్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పేరూరు పంచాయతీలోని మహిళలకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలపై జరిగే హింసను నిర్మూలించడానికి ఐక్యరాజ్యసమితి ప్రత్యేకంగా ఈ దినోత్సవాన్ని ప్రకటించిందని, మహిళలు తమ హక్కులపై అవగాహన పెంచుకుని హింసకి వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు రావాలన్నారు. మౌనాన్ని వీడి మార్పువైపు అడుగులు వేయాలని, పరస్పర సహకారంతో సురక్షిత వాతావరణాన్ని ఏర్పరచుకోవాలన్నారు. ప్రస్తుతడిజిటల్ ప్రపంచంలో మహిళలపై హింస కొత్త రూపాలలో పెరుగుతోందని, మహిళలు ఎదుర్కొంటున్న భౌతిక, మానసిక, ఆర్థిక, సామాజిక, హింస రూపాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ అరాష్‌మెంట్, బెదిరింపులు, సైబర్‌స్టాకింగ్, డీప్‌ఫేక్ వంటి టెక్నాలజీ ఆధారిత హింసకు పాల్పడుతున్నారని, టెక్నాలజీ వినియోగంలో మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల చట్టపరమైన రక్షణ కోసం ప్రభుత్వం 100,181,1091 వంటి హెల్ప్‌లైన్ సదుపాయాలను అందుబాటులోకి తెచ్చిందని, వీటిని సద్వినియోగించుకోవాలన్నారు. డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పత్తిపాటి నాగేశ్వరరావు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు రమేష్, వాహిని, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నీరజ, డాక్టర్ పద్మావతి, పక్కన ఏపీఎం నాగేశ్వరరావు తదితరులు

ఇదేం 'చెత్త' పని!



రోడ్డు పక్కన చెత్త పారబోస్తున్న తడ పంచాయతీకి చెందిన ట్రాక్టర్

తడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సేకరించిన చెత్తతో సంపద సృష్టించాలని, తద్వారా పంచాయతీలు ఆర్థిక వనరులు పెంచుకోవాలని ప్రభుత్వం చెబుతోంది. అంతేకాకుండా గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు పచ్చదనం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తోంది. అయితే తడ పంచాయతీ అధికారులకు ఇవేవీ పట్టడంలేదు. పంచాయతీలో సేకరించిన చెత్తను తీసుకెళ్లి బోడిలింగాలపాడు శివాలయానికి సమీపంలో జాతీయ రహదారి పక్కన పోస్తున్నారు. ఆరు నెలల క్రితం కలెక్టర్ ఆ దారిలో వెళ్తూ చెత్త రోడ్డు పక్కన వెయ్యొద్దని ఆదేశించారు. దీంతో రేకులు అడ్డుగా పెట్టి రహదారి పక్కన చెత్త కనిపించకుండా చేశారు. కొన్నాళ్లకు ఆ రేకులు కిందపడిపోయాయి. మళ్లీ తడ, తడకండ్రిగ పంచాయతీల పరిధిలోని చెత్తను జాతీయ రహదారి పక్కన పోస్తున్నారు. తాజాగా మంగళవారం ఉదయం తడ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ రోడ్డుపైనే చెత్తను పారవేసి వెళ్లిపోయింది. కలెక్టర్ ఆదేశించినా బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతి ఎకరాకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం



తెలుగుగంగ కాలువ వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు రామకృష్ణ, సునీల్‌కుమార్, విజయశ్రీ

బాలాయపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఎకరాకు సాగునీరు అందించి పంటలను పండించేలా ప్రోత్సహించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని ఊట్లపల్లి సమీపంలో ఉన్న తెలుగుగంగ 5వ బ్రాంచ్ కెనాల్ వద్ద పూజలు నిర్వహించి మూడు నియోజకవర్గాలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుగంగ నీటిని విడుదల చేయడం ద్వారా మూడు నియోజకవర్గాల్లోని రైతాంగానికి సాగునీటి భరోసా లభిస్తుందన్నారు. ప్రస్తుతం 15వేల క్యూసెక్కుల నీటిని తెలుగుగంగ కాలువల ద్వారా విడుదల చేయడం జరిగిందన్నారు. రైతు సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మస్తాన్ నాయుడు, సీసీ నాయుడు, వెంకటకృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయండి



ఏఐసీసీ పరిశీలకురాలు సుధారామ కృష్ణన్‌తో కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్, డీసీసీ అధ్యక్షుడు బాలగురువం బాబు తదితరులు

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఏఐసీసీ పరిశీలకురాలు సుధారామ కృష్ణన్ అన్నారు. మంగళవారం సూళ్లూరుపేట ఆర్‌అండ్‌బీ బంగ్లాలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు నేతలు, కార్యకర్తలు కలిసి పనిచేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో పర్యటించి కార్యకర్తల సూచనలు, సలహాలు తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడి నియామకంపై కార్యకర్తల అభిప్రాయ సేకరణ దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్, జిల్లా అధ్యక్షుడు బాలగురువం బాబు, నాయకులు వెంకటాచలపతి, హరికృష్ణ, బద్దెపూడి రాజారెడ్డి, దేవదానం, వెంకటరత్నం, జానకిరామ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి వెంకట నాగపవన్ కుమార్

గూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరిగే భౌతిక, మానసిక, ఆర్థిక, లైంగిక హింసలను అరికట్టి సమాజంలో చైతన్యం పెంపొందించడమే అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవ ప్రధాన ఉద్దేశమన్నారు. మహిళలకు భద్రత కల్పించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, అరవ పార్వతయ్య, మెహబూబ్ బాషా, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైతన్న సమస్యలను విస్మరిస్తే ఉపేక్షించం: కురుగొండ్ల

వెంకటగిరి, నవంబర్ 25(ఆంధ్రజ్యోతి): రైతన్న సమస్యలను విస్మరిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులను హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని కలవలపూడి పంచాయతీ జీకేపల్లిలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రైతుల ఇళ్ల వద్దకు, పొలాల వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కరించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. రైతుల ఇళ్ల వద్దకు వెళ్ళి కరపత్రాలు అందజేసి ప్రభుత్వ పతకాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విశ్వనాధ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నీ అమలు

వెంకటగిరి, నవంబర్ 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీనీ ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు వెంకటగిరిలో నిర్వహించిన జాబ్‌మేళాల ద్వారా 350 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. నాలుగేళ్లలో రాష్ట్రంలో 20 వేల ఉద్యోగాలు ఇవ్వడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొందన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పచ్చదనం, పరిశుభ్రత అంశంపై అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారి చైతన్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం మన్నెముత్తేరి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్న కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని మన్నెముత్తేరి, ఇసుకమిట్ట, కోళ్లమిట్ట, రాఘవయ్యపేట, బాపూజీకాలనీ, కసారెడ్డిపాలెం, డేగలపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని రైతులు, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

అందుబాటులో యూరియా

వెంకటగిరి టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యూరియా అందుబాటులో ఉందని, రైతులు అధైర్యపడాల్సిన పనిలేదని ఏడీఏ అనసూయ అన్నారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో రైతులందరికీ అవసరమైన యూరియా అందుబాటులో ఉందన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం తీసుకొస్తే రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ చేస్తామని చెప్పారు.





బురదమయంగా ఉన్న నాయుడుపేట - పాత వెంకటగిరి రోడ్డు - గుంతలమయంగా మారిన దారి - బురద తగ్గడంతో దుమ్ము

వానొస్తే బురద... ఎండొస్తే దుమ్ము

- ఇటీవలి వర్షాలకు దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు
- మున్సిపల్ నిధులు రూ.10 లక్షలతో మరమ్మతులు
- వారం రోజులకే అధ్వానంగా మారిన రహదారి

నాయుడుపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - పాత వెంకటగిరి రోడ్డు వానొస్తే బురద... ఎండొస్తే దుమ్ముతో వాహనదారులు, పాదచారులకు నరకం చూపుతోంది. నాయుడుపేట - మేనకూరు సెజ్‌లోని పరిశ్రమలకు, పాఠశాలలకు వెళ్లే వాహనాల రాకపోకలతో ఈ దారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలమయంగా మారి వాహనాలు, పాదచారులు వెళ్లలేని పరిస్థితులు నెలకొంది. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ఈ రోడ్డు ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్నప్పటికీ మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ.10 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఆ పనులు చేసిన ఐదు రోజులకే మళ్లీ రోడ్డు అధ్వానంగా మారి తిరిగి యథాస్థితికి చేరుకుంది. మొక్కుబడిగా, నాణ్యత లేకుండా పనులు చేయడంతోనే రోడ్డు వారం రోజులకే దెబ్బతిందని, రూ.10 లక్షలు వృథా అయ్యాయని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ నడిబొడ్డున రోడ్డు బురదమయంగా మారి ప్రయాణికులు అవస్థలు పడుతుంటే అధికారులకు పట్టడంలేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాల్సిన అవసరం ఉంది.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం: పాశం



రైతులకు కరపత్రాలను అందజేసి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్నదాతలకు అండగా నిలిచేందుకు వారికి అనేక పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. పంటల సాగుకు చేయూత అందించేందుకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో రెండో విడత జమ చేయడం జరిగిందన్నారు. అలాగే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలుస్తోందన్నారు. సాగుకు అవసరమైన యూరియా కొరత లేకుండా ప్రతిరైతుకూ ఎకరానికి మూడు బస్తాలు అందించేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే రాయితీతో డ్రోన్‌లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులు, అమరేంద్ర, సునీల్, వ్యవసాయశాఖ ఏడీ గోపినాయక్, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకే యూరియా

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భూములను సాగుచేసే రైతులకే యూరియా అందజేస్తామని దామానెల్లూరు సొసైటీ డైరెక్టర్ పుట్టు విజయరాఘవులు స్పష్టం చేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'యూరియా.. ఈ తీరు బాగలేదయా.. సాగులేని భూములకు గుర్తింపు కార్డులా?' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో దామానెల్లూరు సొసైటీ డైరెక్టర్, సీఈవో రామయ్య స్పందించారు. భూములను సాగుచేసే రైతులందరికీ ఇబ్బంది లేకుండా యూరియా అందజేస్తున్నామని చెప్పారు. కొందరు వైసీపీ నాయకులు కావాలనే ప్రభుత్వంపై బురదజల్లేందుకు సాగులో లేని భూములకు వ్యవసాయాధికారుల నుంచి గుర్తింపు కార్డులు తెచ్చుకుని యూరియా కొరత ఉందని రైతులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారన్నారు. ఇది మంచి పద్ధతికాదని, సాగుచేసే రైతులందరికీ యూరియా అందజేస్తామని సొసైటీ డైరెక్టర్ తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాలు లేనివారికి కూడా యూరియా ఇస్తామన్నారు. వ్యవసాయ అధికారులు కూడా గుర్తింపు కార్డులు ఇచ్చే సమయంలో ఆ సర్వే నెంబరు సాగులో ఉందా లేదా నిర్ధారించుకోవాలని సూచించారు.

డంపింగ్ యార్డు కోసం స్థల పరిశీలన

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ డంపింగ్ యార్డు సమస్య మళ్లీ మొదటకొచ్చింది. గతంలో కొణ్ణంబట్టు రెవెన్యూ పరిధిలో డంపింగ్ యార్డు కోసం పది ఎకరాల స్థలాన్ని కేటాయించారు. గ్రామస్తుల నుంచి వ్యతిరేకత రావడంతో పాటు సమస్యలు తలెత్తడంతో అక్కడ చెత్తను వేయలేదు. అప్పటి నుంచి ప్రస్తుతం రీసైక్లింగ్ చేస్తున్న డంపింగ్ యార్డు వద్దే చెత్తను వేస్తున్నారు. తాజాగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి డంపింగ్ యార్డు స్థలం కోసం మంగళంపాడు చెరువు పక్కన సర్వే నెంబరు 2లో అనాదీనం భూములను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు కొందరు అక్కడికి చేరుకుని అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. చేసేదేమీ లేక తహసీల్దార్ అక్కడికి వచ్చిన గ్రామస్తులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసి అక్కడ నుంచి వెనుతిరిగి వచ్చారు.

రైతాంగానికి అండగా ప్రభుత్వం: విజయశ్రీ



రైతులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

పెళ్లకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం రైతాంగానికి అండగా ఉంటోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని రావులపాడులో గ్రామంలో చిల్లకూరు సొసైటీ చైర్మన్ కేవీ నాయుడు ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పంచ సూత్రాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు సాగునీటి యాజమాన్యం, రాయితీతో వ్యవసాయ పనిముట్లు, విత్తనం నాటిన నాటి నుంచి నూర్పిడి వరకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జున సాగర్, ఏవో విజయభారతి, ఎంపీడీవో ప్రమీలారాణి, డిప్యూటీ తహసీల్దార్ యువరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, నాయకులు పేరం రమేష్ నాయుడు, కందమూడి శివకుమార్, చైతన్యకృష్ణారెడ్డి, మాధవరెడ్డి, నరేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



దక్షిణపాలం గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గూడలి పంచాయతీ దక్షిణ పాలం గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు, సర్వే బృందాలు ఇంటింటికీ వెళ్లి రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి, రైతు కార్యదర్శి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మైనార్టీ సెల్ నాయకులు మస్తాన్‌బాషా, పోలమ్మ, యువత అధ్యక్షుడు సురేష్‌గౌడ్, సుబ్రహ్మణ్యం యాదవ్, అధికారులు పాల్గొన్నారు.

ఆవాజ్ ప్లస్ సర్వేలో నమోదు కావాలి

కోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పక్కాగృహాలు కావాల్సిన వారు ఆవాజ్ ప్లస్ సర్వేలో నమోదు అయి ఉండాలని గృహనిర్మాణశాఖ డీఈ షబ్బీర్, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆవాజ్ ప్లస్ పథకంపై సచివాలయ ఉద్యోగులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష జరిపారు. ఆవాజ్ ప్లస్ పథకంలో నమోదయ్యేందుకు ఈనెల 30వ తేదీ ఆఖరు గడువని చెప్పారు. ఇప్పటి వరకు మండలంలోని 21 పంచాయతీల్లో సర్వే జరిపి అర్హులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇంకా అర్హులైన వారు ఉంటే పక్కాగృహాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ భాస్కర్‌రావు, టీడీపీ నేతలు జలీల్ అహ్మద్, వెంకటకృష్ణారెడ్డి, మస్తాన్‌బాషా, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ అనురాధ, పక్కన ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ తదితరులు

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు సమాజంలో ఉన్నత శిఖరాలకు చేరాలన్న, ఆర్థికంగా ఎదగాలన్న ప్రాథమిక దశ నుంచే పట్టుదలతో చదవాలని ప్రముఖ వైద్యురాలు అనురాధ అన్నారు. సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జూనియర్ కళాశాలలో నర్సింగ్ విద్యార్థుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అనురాధ మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడపిల్లలకు విద్య ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. అనంతరం సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేలం పాటల వాయిదా

కోట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపాలు, లైటింగ్, షామియానా నిర్వహణకు దేవదాయశాఖ ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం వేలం పాటలు నిర్వహించారు. ఒక్కరు మాత్రమే ముందుకొచ్చి వేలంలో పాల్గొన్నారు. దీంతో అధికారులు వేలం పాటలను వాయిదా వేశారు.

రైతాంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం: సీపీఐ

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మహిళా నాయకురాలు చెంచమ్మ అధ్యక్షతన నియోజకవర్గ సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కుల, మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నరేంద్ర మోదీ ఒకటి కూడా నెరవేర్చకపోవడం దారుణమన్నారు. రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, నాయకులు మోదుగుల పార్థసారధి, సుధాకర్‌రెడ్డి, రాధాకృష్ణ, నాగేంద్ర, శ్రీనివాసులు, కుమార్, నాగేంద్ర, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో హౌసింగ్ అధికారులకు గాయాలు

కోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తేనెటీగలు దాడి చేయడంతో హౌసింగ్ అధికారులు గాయపడిన ఘటన కోట మండలం కొండుగుంట వద్ద మంగళవారం జరిగింది. హౌసింగ్ డీఈ షబ్బీర్, ఏఈ భాస్కర్‌రావు లేఅవుట్‌లను పరిశీలించేందుకు కొండుగుంట నర్సరీ వద్దకు వెళ్లారు. అక్కడ స్థల పరిశీలన చేస్తుండగా కొండ తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో అధికారులు పరుగులు తీశారు. తీవ్రంగా గాయపడిన అధికారులను స్థానికులు చిట్టెడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గూడూరుకు తీసుకెళ్లారు.

మంత్రి సత్యకుమార్‌కు సన్మానం



మంత్రి సత్యకుమార్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు విజయభాస్కర్, చెంచుకృష్ణయ్య

నాయుడుపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను బీజేపీ ఎస్సీసెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బొల్లకాయల విజయభాస్కర్, మాజీ జిల్లా కార్యదర్శి ఆళ చెంచుకృష్ణయ్య సన్మానించారు. మంగళవారం ఉమ్మడి నెల్లూరుజిల్లా మనుబోలులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి సత్యకుమార్ ప్రారంభించిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆరూరు సుధాకర్, యనమల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వలస కూలీ మృతి

వాకాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొనడంతో వలస కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని సిద్దిగుంటపాళెం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఫజిల్‌పూర్ నివాసి దులాల్ సర్దార్(65) వరినాట్లు వేసేందుకు నెల రోజులక్రితం నుంచి సిద్దిగుంటపాళెం గ్రామానికి వచ్చాడు. అక్కడే ఓ గోదాములో అద్దెకుంటూ కూలి పనులకు వెళ్తున్నాడు. మంగళవారం రాత్రి దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకొని వస్తుండగా బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన దులాల్ సర్దార్ అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగబాబు తెలిపారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు యువకులు నెంబరు ప్లేటు లేని ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన మంగళవారం రాత్రి సూళ్లూరుపేట పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సూళ్లూరు బొగ్గుల కాలనీకి చెందిన మన్నారు మంగమ్మ బాపూజీ కాలనీలో ఉన్న తన కుమార్తె ఇంటికెళ్లి తిరిగి వస్తుండగా విద్యుత్‌శాఖ ఈఆర్ కార్యాలయం వద్ద ఇద్దరు యువకులు మోటారు సైకిల్ వేగంగా వచ్చి మంగమ్మ మెడలోని 3 సవర్ల బంగారు గొలుసు లాక్కొని వెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే స్పందించి సమీపంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. నమోదు దర్యాప్తు చేపట్టారు.

కుష్ఠువ్యాధి నిర్ధారణ పరీక్షలు

గూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేగనూరు, కొండాగుంట, వెందోడు, చెన్నూరు సచివాలయాల పరిధిలో మంగళవారం చెన్నూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్ఠునిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజేంద్రప్రసాద్, మస్తానయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ సెర్చ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న జేవీవీ సభ్యులు, ఉపాధ్యాయులు

గూడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన గూడూరు మండలం చెన్నూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు జేవీవీ సభ్యులు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జేవీవీ సభ్యులు మాట్లాడుతూ జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలోని సైన్స్‌సెంటర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌టాలెంట్ సెర్చ్ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మండలంలోని చెన్నూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు తరుణ్‌కుమార్, ఆదిత్య, వహీద్‌అహ్మద్ ప్రతిభచాటి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు, చెంచునారాయణ, నాగరాజు, పురుషోత్తమరావు, ప్రభాకర్, హెచ్‌ఎం బాలనాగమ్మ, ఉపాధ్యాయులు వీరాస్వామి, చంద్రశ్రీ, లోకేశ్వరి, శ్రీవాణి, సునీత పాల్గొన్నారు.

హింసలేని సమాజం కావాలి



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మహిళల మానవహారం

సూళ్లూరుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హింసలేని సమాజం కోసం మహిలందరూ సమైక్యంగా పోరాడాలని ఏపీఎం ప్రసన్నకుమారి అన్నారు. అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వెలుగు సభ్యులకు, లీడర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై హింస ఒక సాధారణ అంశంగా రూపు దాల్చడం ఆందోళనకరమన్నారు. ఎంపీడీవో మురళీకృష్ణ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టాలని అన్నారు. తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం మహిళలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీసీలు సుధాకర్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.